


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 351, పేజీలు - 08

గురువారం, జూన్ 11, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# నాలుగో నగర కల సాకారం దిశగా మరో అడుగు

## ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సీడీఏ బిల్డింగ్ ప్రారంభం

- హైదరాబాద్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- చెరువుల ఆక్రమణలు తొలగించి 'లేక్ ఎకానమీ' అభివృద్ధి చేస్తామని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో కబ్జాదారుల కోరలు పీకే సమయం వచ్చింది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లక్షల మంది ప్రజల హక్కుల కోసం, హైదరాబాద్ భవిష్యత్తు కోసం, ఆక్రమణలపై రాజీ లేని పోరాటం కొనసాగుతుంది అని చెప్పుకొచ్చారు. చెరువులు ప్రజలవి, భూములు ప్రజలవి హక్కులు కూడా ప్రజలవే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేసి ప్రపంచానికి అద్భుతమైన నగరాన్ని అందించబోతున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నగరానికి గొప్ప చరిత్ర ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### జంట నగరాల నుంచే 60 శాతం ఆదాయం

'200 యేళ్ల క్రితం హైదరాబాద్‌ను విస్తరించడం వల్ల సికింద్రాబాద్‌తో కలిసి జంట నగరాలుగా విలసిల్లుతున్నాయి. రాష్ట్రానికి 60 శాతం ఆదాయం ఇక్కడి నుంచి వస్తోంది. బంగారానికి కంటే రంగారెడ్డి జిల్లా భూములకు విలువ ఎక్కువ'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'1908లో తుఫాన్ వచ్చి వేలాది మంది ప్రాణాలు కోల్పోతే ఆ నాటి నిజాం నవాబు మూసీ నది పైన నిర్మాణాలు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో యుద్ధ సామాగ్రిని ఉంచడం వల్ల శత్రు దుర్భేద్యంగా మారింది. ఆ నాటి పాలకులు సైబరాబాద్ ను నిర్మించి గొప్ప నగరాన్ని ప్రపంచానికి అందించారు. హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం ,జీనోమ్ వ్యాలీ లాంటివి వద్దే వద్దన్నారు.ఆ నాడు కూడా

2లో..



# వరుస భేటీలతో వేడెక్కిన రాజకీయం

- టీఎంసీ విలీనంపై జోరుగా ప్రచారం - కాంగ్రెస్ వర్గాలు కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్‌లో టీఎంసీని విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ , ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీలు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలతో వరుస భేటీలు రాజకీయ వర్గాల్లో ఎత్తున చర్చకు దారితీసింది. ప్రతిపక్ష ఇండియా

2లో..

## ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ

# సరికొత్త చరిత్ర

## ప్రపంచ దేశాల అధినేతల అభినందనలు



- నెహ్రూ చారిత్రాత్మక రికార్డు బద్దలు
- జనసేవే సుపరిపాలనకు కొలమానం
- ఇందిరా గాంధీ రికార్డు సైతం అప్రాధాన్యమే

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై నిరంతరాయంగా అత్యంత ఎక్కువ కాలం పాటు సేవలు అందించిన ప్రధానిగా మోదీ భారతదేశ చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఈ క్రమంలో భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. బుధవారం (2026 జూన్ 10) నాటికి ప్రధానిగా 4,399 రోజుల పదవీకాలాన్ని మోదీ పూర్తి చేసుకున్నారు. 1952లో దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత నెహ్రూ 1952 మే 13న ఎన్నికైన ప్రధాన మంత్రిగా తొలిసారి

2లో..

## స్టీల్ ప్లాంట్ బాధితులకు రూ. కోటి ఇవ్వాల్సిందే

కూటమి ప్రభుత్వంపై జగన్ ఫైర్!



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాద బాధితులను, మృతుల కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ప్రత్యక్షంగా పరామర్శించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను

2లో..

## ఉత్తర-దక్షిణ విభేదాలు

# దేశానికి ప్రమాదకరం

## పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు



- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టవద్దు
- ఏపీకి రూ.7,707 కోట్లు కేటాయించిన కేంద్రానికి ధన్యవాదాలు
- తాను తెలంగాణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్న పవన్ కల్యాణ్
- విభజన జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించినట్లు వెల్లడి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రముఖ జాతీయ వార్తా సంస్థ పాడ్‌కాస్ట్‌లో దేశ రాజకీయాలపై అత్యంత కీలకమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ , తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వివాదాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఒక జాతీయ పార్టీ అయి ఉండి కూడా కాంగ్రెస్ ప్రాంతీయ పక్షపాతాన్ని, సంకుచిత సెంటిమెంట్లను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. దశాబ్దాలుగా హైదరాబాద్‌లోనే ఉంటూ, ఇక్కడి సమాజంతో మమేకమైన తనను కాంగ్రెస్ నేతలు కొందరు అవుట్‌సైడర్ అని పిలవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు చిల్లర శక్తులను నాపైకి పంపుతూ హైదరాబాద్‌లో అడుగుపెట్టలేవని బెదిరిస్తున్నారని,

2లో..

# తెలంగాణలో మావోయిజం లేదు

## - ప్రతీ పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజూ నిర్దిష్ట సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి కేటాయించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. పోలీసు-ప్రజల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాల దర్యాప్తులో పోలీసు డాగ్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీవీ ఆనంద్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై

2లో..

## తెలంగాణ హోం శాఖ కార్యదర్శిపై

# కోర్టు ధిక్కరణ పిటిషన్

## - పెద్దికి సాయం చేయబోయి ఇరుక్కున్న రేవంత్ సర్కార్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పెద్ది సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. టికెట్ ధరలు పెంచుకునేందుకు హోంశాఖ అనుమతి ఇవ్వగా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి మెమో ఇచ్చారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే హోంశాఖ జారీ చేసిన మెమో అక్రమమని తెలిపిన హైకోర్టు టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించాలని ఈ సందర్భంగా ధర్మాసనం తెలిపింది. పెద్ది సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చిన తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా

2లో..




# చైతన్య కాలేజీ సీజ్

## "ప్రజాప్రశ్న" కథనంతో అధికారుల చర్యలు




ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

అనుమతులు లేకున్నా కాలనీలో వెలుస్తున్న కార్పొరేట్ కళాశాలలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హబ్సిగూడా డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నెం. 3, కాకతీయ నగర్‌లో నిర్వహిస్తున్న చైతన్య కాలేజీపై గత ఒక సంవత్సరం నుంచి హైకోర్టులో కేసు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అవసరమైన అనుమతులు లేకుండా కాలేజీ నిర్వహిస్తున్నారని స్థానిక కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంటర్మీడియట్ బోర్డు, విద్యాశాఖ, ఇతర శాఖలకు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన చర్యలు లేకపోవడంతో స్థానిక ప్రజలు శాంతియుతంగా తమ నిరసనను కొనసాగించారు. నివాస ప్రాంతానికి మాత్రమే అనుమతులు ఉన్న ప్రాంతంలో కాలేజీ నిర్వహించడం వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు సమస్యలపై "ప్రజాప్రశ్న" దినపత్రిక జూన్ 9 నాడు అనుమతులు లేకున్నా కాలనీలలో వెలుస్తున్న కార్పొరేట్ కళాశాలలు అన్న శీర్షిక ప్రచురించడంతో పాటు విద్యాశాఖ అధికారుల దృష్టికి ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు బుధవారం నాడు స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

దీనితో స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయం వెంటనే సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో విద్యాశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు.



# నాలుగో నగర కల సాకారం దిశగా మరో అడుగు

అనేక కుట్రలు , కుతంత్రాలు చేశారు'అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.'మూసీలో మురికి కంటే ఎక్కువ విషాన్ని చిమ్మారు.ఆ నాటి పాలకులు హైటెక్ సిటీ, అవుటర్ రింగ్, అంతర్జాతీయ ఎయిర్ పోర్టు , జీనోమ్ వ్యాలీ లాంటి తీసుకురాకపోతే ఈ నాడు 10 లక్షల మందికి ఉపాధి లభించేదా.?'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

### ఫామ్‌హౌస్‌లో శుక్రాచార్యుడు

'రావణాసురుడు, శుక్రాచార్యుడు, మారీచుడు, సుభావుడులా ఆ నాడు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు శుక్రాచార్యుడు ఫామ్ హౌస్‌లో ఉండి మారీచుడు, సుభావుడిని పంపించాడు. భారత్ ఫ్యూచర్ సిటీ ని రద్దు చేస్తామని పెద్ద రాక్షసుడు, చిన్న రాక్షసులు అంటున్నారు'అని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచానికి ఒక దిక్సూచిగా ఫ్యూచర్ సిటీని గొప్ప నగరంగా తీర్చిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కళ్లలో నిప్పులు పోసుకుని, కడుపులో విషం నిప్పుకొని అమెరికాలో కూడా ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారు.వాళ్లని తెలంగాణ ప్రజలు తిరస్కరించారు, వాళ్లకు గతమే తప్ప భవిష్యత్తు లేదు. ఫ్యూచర్ సిటీ ని రద్దు చేస్తామంటే వచ్చే సారి ప్రతి పక్ష హోదా కూడా రాదు. ఈ ప్రాంత ప్రజలు బండకేసి కొడతారు'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### 150 రోజుల్లో ఫ్యూచర్ సిటీ అథారిటీ డెవలప్మెంట్ కార్యాలయం ప్రారంభం

సరిగ్గా 150 రోజుల్లో ఫ్యూచర్ సిటీ అథారిటీ డెవలప్మెంట్ కార్యాలయాన్ని ప్రారంభించుకున్నాం.2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి భారత్ ఫ్యూచర్ సిటీ కీలకం కావాలి అని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.'తొలకరి వర్షం పడితేనే హైదరాబాద్‌లో రోడ్డులు ఎక్కడిక్కడ స్తంభించిపోయాయి. కిలోమీటర్ దూరానికి రెండు నుంచి నాలుగు గంటల పట్టింది. రూ.100 కోట్లకు ఎకరం అమ్మినమని జబ్బలు చర్చుకున్న వాళ్లు నిన్నటి వరదలకు సమాధానం చెప్పాలి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని, కుంటలను చెరపట్టడం వల్లనే చెరువుల్లో ఉండాల్సిన నీళ్లు కాలనీలు, బస్తీలకు వచ్చాయి. ప్రభుత్వ భూములు, చెరువులను , కుంటలను ఆక్రమించుకున్న వారి కట్టడాలను నిర్ధాక్ష్యణంగా కూలుస్తున్నాం. మేం ఎవరైనా ఇంచు భూమైనా తీసుకున్నామా.? ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్దరిస్తున్నాం. లేక్ ఎకనామీని తయారు చేస్తున్నాం మహిళా సంఘాలు వ్యాపారం చేసుకునేలా చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### హైదరాబాద్‌లో కబ్జాకోరుల పనిపడుతున్నాం

'రాజేంద్రనగర్‌లో చెరువు ఆక్రమణలను తొలగించి పునరుద్దరించాం. కూకట్‌పల్లి నల్ల చెరువు, అంబర్‌పేటలో బతుకమ్మ కుంటను పునరుద్దించాం. బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్ రెడ్డి బతుకమ్మ కుంటను ఆక్రమించి హెలికాప్టర్‌లో పూలు చల్లాడని గత ప్రభుత్వం ఆయనకు రాసి ఇచ్చింది.బతుకమ్మ కుంటను దుర్మార్గులు చెరపడితే వాళ్ల పని పట్టి పునరుద్దించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'గండి పేట, హిమాయత్ సాగర్‌ను గొప్ప వ్యక్తులు ఆక్రమిస్తే వాళ్లను ఖాళీచేయించదానికి ప్రయత్నం చేస్తున్నాం. ముంబయిలో వర్షం వస్తే జనం బయటకు రాని పరిస్థితి ఉంది. చెన్నైలో వర్షం వస్తే పడవల్లో తిరుగుతున్నారు. కొల్ కత్తాలో శాంతిభద్రతలు లేవు. బెంగళూరులో ట్రాఫిక్ జాంలు ఉన్నాయి. హైదరాబాద్‌లో కబ్జాకోరుల పనిపడుతున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### ఫ్యూచర్ సిటీకి అడ్డుపడే వాళ్లను తొక్కుకుంటూ వెళ్లండి

'ప్రపంచం మన వైపు చూస్తుంది. జూన్ 10, 2026న తేదీన సువర్ణ అధ్యాయాన్ని సృష్టించాం. గ్రీన్ ఫార్మా, జీసీసీ, ఐటీ కంపెనీలు లతో పాటు ప్రపంచంలోని ప్రసిద్ధి గాంచిన 500 పెద్ద కంపెనీలను ఫ్యూచర్ సిటీకి రప్పించబోతున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.'మరో గ్లోబల్ సమ్మిట్ పెట్టి ప్రపంచ దేశాలను ఇక్కడికి రప్పించాం. ఫ్యూచర్ సిటీలో కొన్ని గ్రామాలను ఈ రోజు కలిపాం.ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి గొప్ప నగరంగా రాణిస్తుందనడంలో అనుమానం లేదు. అడ్డుపడిన వాళ్లను అడ్డంగా తొక్కుకుంటు ఈ ప్రాంతం వాళ్లే వెళ్తారు.ఈ నగరాన్ని ఇక్కడి వాళ్లే కాపాడుకుంటారు.ప్రపంచానికి దిక్సూచి గా ఈ ప్రాంతం ఉంటుంది. కాలుష్య రహిత గొప్పనగరంగా తీర్చిదిద్దుతాం. వీలైనప్పుడల్లా ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయానికి వస్తాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు వారానికోసారి ఇక్కడికి వస్తారు'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# వరుస భేటీలతో వేడెక్కిన రాజకీయం

కూటమిలో సమన్వయాన్ని బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారం కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్ గాంధీతో గంటన్నర పాటు సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం తాము బలమైన కూటమిని కోరుకుంటున్నామని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అంగీకరిస్తున్నామని ఈ సమావేశంలో తృణమూల్ తెలియజేసింది. విలీనానికి సంబంధించిన ఏ ప్రతిపాదన అయినా తృణమూల్ నుంచే రావాలని, తాము అలాంటి చర్య కోసం ఒత్తిడి చేయడం లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది.దీనికి ముందు మంగళవారం మమతా బెనర్జీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీలు సమావేశమయ్యారు. ఇండియా కూటమి సమావేశంలో మమతా బెనర్జీ, సోనియా గాంధీల ఆలింగనానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా దీనిని తృణమూల్ పార్టీ వారి మధ్య ఉన్న దీర్ఘకాల అనుబంధానికి సంకేతంగా అభివర్ణించింది. సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశం అనంతరం ఇరు పార్టీల మధ్య నిరంతరం సాగుతున్న చర్చల్లో భాగంగానే బుధవారం రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీల మధ్య ఈ భేటీ జరిగింది. బీజేపీని ఢీకొట్టేందుకు ప్రతిపక్షాల మధ్య మరింత సమన్వయం, ఐక్యత అవసరమని విపక్ష నాయకులు నొక్కి చెప్పారు.మరోవైపు, బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాంకర్ సర్కార్ విలీనానికి తలుపులు తెరిచే ఉంచామని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

'రాజకీయాలు అంటేనే సాధ్యసాధ్యాల కళ కాబట్టి రేపు ఏదైనా జరగవచ్చు' అని వ్యాఖ్యానించారు. "ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి, బీజేపీ నియంతృత్వానికి వ్యతిరేకంగా మా నాయకుడు రాహుల్ గాంధీ అవిశ్రాంతంగా పోరాడుతున్నారు, ఈ విషయంలో ఎక్కడా రాజీపడలేదు ఆయన ఎంతో అణచివేతకు గురయ్యారు. రాహుల్ గాంధీ సమాజంలోని వెనుకబడిన వర్గాలకు, కష్టాల్లో ఉన్న ప్రజలకు గొంతుకగా మారాలని మేము కోరుకుంటున్నాం ఆయనే ప్రధాని కావాలి ఈ విషయాన్ని అంగీకరించే ఎవరికైనా మా తలుపులు తెరిచే ఉంటాయి, అంత ధైర్యం లేని వారు కాంగ్రెస్‌లో చేరలేరు తప్పులు చేసినవారే తమ తప్పులు కడుక్కోవడానికి వాషింగ్ మెషిన్ కోసం వెతుక్కుంటారు" అని సర్కార్ అన్నారు.కాగా, టీఎంసీ, కాంగ్రెస్‌లకు ఉమ్మడి చరిత్ర ఉంది. మమతా బెనర్జీ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. 2011లో పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కాంగ్రెస్, టీఎంసీ కలిసి పనిచేశాయి, కానీ మరుసటి ఏడాదే వారి పొత్తు విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇండియా కూటమిలో భాగస్వాములయ్యారు. సోనియా గాంధీతో మమతా బెనర్జీ సమావేశమైన తర్వాత ఈ పార్టీల మధ్య సంబంధాలు మరింత బలపడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవలి బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత తిరుగుబాటును ఎదుర్కొంటున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొంతమంది ఎమ్మెల్యేలు, ఆ తర్వాత పలువురు ఎంపీలు పార్టీ నుంచి విడిపోయి బీజేపీ, ఎన్డీఏలతో పొత్తు పెట్టుకుంటామని సంకేతాలు ఇచ్చారు.

# తెలంగాణ హోం శాఖ కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటిషన్

గోయెల్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. 10 రోజుల పాటు పెద్ది టికెట్ ధరలను పెంచుకునేలా ఈ నెల 2వ తేదీన హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించి హోం శాఖ కార్యదర్శి మెమో ఇచ్చారని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం రోజున తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది.తెలంగాణ హోంశాఖ జారీ చేసిన మెమో అక్రమమని ఈ సందర్భంగా కోర్టు తేల్చి చెప్పింది.

సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 121ను పాటించాలని కోర్టు ప్రభుత్వానికి సూచించింది. అయితే కోర్టు వ్యాఖ్యలపై స్పందించిన ప్రభుత్వం తరఫు లాయర్.. ఈ వ్యవహారంలో హోంశాఖ నుంచి వివరాలు సేకరించడానికి తమకు సమయం కావాలని కోర్టును కోరారు. ప్రభుత్వం తరపు న్యాయవాది చేసిన విజ్ఞప్తికి అంగీకరించిన హైకోర్టు ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.పెద్ది సినిమాకు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ తెలంగాణ సర్కార్ జూన్ 2వ తేదీన జీవో ఇచ్చింది. సినిమా రిలీజ్ తేదీ నుంచి 10 రోజుల పాటు టికెట్ ధరలను అదనంగా వసూలు చేసుకునే అవకాశం కల్పించారు.

సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.100 మల్టీప్లెక్స్‌లలో రూ.125 అదనంగా వసూలు చేసుకోవచ్చని తెలిపారు. అదే సమయంలో రోజుకు 5 షోలను కూడా ప్రదర్శించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టికెట్ ధరలు పెంచిన తర్వాత సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.275 మల్టీప్లెక్స్‌లలో రూ.445కు పెరిగింది.

# ఉత్తర-దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం

నా మాతృభూమిలో నేను ఎక్కడికి వెళ్లాలో చెప్పడానికి ఇది ఎవరి జాగీరు కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

### రాహుల్ గాంధీ కూడా దక్షిణాది వ్యక్తి కాదు !

ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి పవన్ కల్యాణ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ పార్టీ గనుక ప్రాంతీయ పక్షపాతంతో నన్ను హైదరాబాద్ రాకూడదని చెబితే, అప్పుడు నేను కూడా రాహుల్ గాంధీకి ఒక విషయం చెప్పాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీ కూడా భారతదేశంలోని దక్షిణ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదు ఆయన ఉత్తరాది వ్యక్తి, మరి ఆయన ఇక్కడికి ఎలా వస్తారు, ఎలా పోటీ చేస్తారు?" అని పవన్ ప్రశ్నించారు. ప్రాథమిక హక్కులు, జాతీయ విలువల గురించి మాట్లాడే ఒక జాతీయ పార్టీ హఠాత్తుగా ఇటువంటి సంకుచిత రాజకీయాలకు పాల్పడటం దేశ సమగ్రతకే ప్రమాదకరమని హెచ్చరించారు. తన మాతృభూమిలో తాను ఎక్కడికైనా వెళ్లే హక్కు తనకు ఉందని, ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

### దేశాన్ని విభజించేలా మాట్లాడకూడదు!

ఇక దేశంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ వంటి దక్షిణాది నేతలు వ్యక్తపరుస్తున్న ఆందోళనలపై పవన్ కల్యాణ్ స్పందించారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల విభజన వల్ల లోక్‌సభ స్థానాలను, రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతామనే భయాన్ని వ్యక్తపరచడంలో ఒక తార్కిక అర్థం ఉందని ఆయన అంగీకరించారు. అయితే, పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా సీట్లను దామాషా ప్రకారం పెంచుతామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సమస్యను కేవలం సాంకేతిక, పరిపాలనాపరమైన కోణంలో చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప, దానిని సాకుగా తీసుకుని ఉత్తరాది – దక్షిణాది విభేదాలను మధ్యలోకి తీసుకురావాల్సిన అవసరం ఎక్కడుందని ఆయన నిలదీశారు.

### ప్రాంతీయవాదం.. తీవ్రవాదం కంటే ప్రమాదకరం

ప్రాంతీయవాదం అనేది కొన్నిసార్లు తీవ్రవాదం కంటే ప్రమాదకరంగా మారుతుందని, అది దేశ ఐక్యతను దెబ్బతీస్తుందని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ముఖ్యమంత్రులు దేశాన్ని ముక్కలు చేసే విధంగా మాట్లాడటం సరికాదని, అటువంటి వ్యాఖ్యలను ఖచ్చితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ గుజరాత్ నుండి వచ్చారని, యావత్ దేశాన్ని ఏకం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ మాతృభాష కూడా హిందీ కాదని గుర్తు చేశారు. భాష, ప్రాంతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తే చివరకు సైన్యం కూడా సరిగ్గా పనిచేయలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక సహకారం, పన్నుల గురించి మాట్లాడితే రేపు ఉత్తరాది రాష్ట్రాలు వచ్చి 'దేశ సరిహద్దుల్లో కాపలా కాసే ఎక్కువ మంది సైనికులను మేము అందిస్తున్నాం' అని వాదిస్తే దానికి ముగింపు ఎక్కడ ఉంటుందని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

### వ్యక్తిగత విషయాలనూ పంచుకున్న పవన్

ఈ ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ తన వ్యక్తిగత ఆలోచనలను, యువత మానసిక స్థితిని కూడా పంచుకున్నారు. ప్రస్తుత తరం యువతకు ఈ ఉత్తర–దక్షిణ ఘర్షణలపై ఎలాంటి ఆసక్తి లేదని, వారు కేవలం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రాథమిక అవసరాల గురించే ఆలోచిస్తున్నారని చెప్పారు. రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ఇలాంటి విభేదాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తాను చిన్నప్పటి నుండి గట్టి జాతీయవాద భావజాలంతో పెరిగానని, దేశ ప్రయోజనాలే తనకు అన్నింటికంటే మిన్న అని స్పష్టం చేశారు. తనకు తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి లేకపోయినప్పటికీ, 2007 నుండి తన వెంటే నడుస్తున్న కరడుగట్టిన తెలంగాణ యువత, జనసేన క్యాడర్ అక్కడ బలంగా ఉన్నారని వారి ద్వారా తెలంగాణ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# స్టీల్ ప్లాంట్ బాధితులకు రూ. కోటి ఇవ్వాల్సిందే

అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన వైఎస్ జగన్ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.ప్రమాదంపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వైఎస్ జగన్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అంటూ నెపం నెట్టేసి చేతులు దులుపుకోవాలని చూడటం సమంజసం కాదు. ఏ సంస్థలో ప్రమాదం జరిగినా, నష్టపోయింది మన ఆంధ్రప్రదేశ్ బిడ్డలే అనే మానవతా దృక్పథం ప్రభుత్వానికి ఉండాలి అని ఆయన డిమాండ్ చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా గంటల వ్యవధిలోనే స్పందించి రూ. కోటి వరకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు.బాధిత కుటుంబాలకు శాశ్వత ప్రాతిపదికన న్యాయం చేయాలని జగన్ డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణమే రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, ఆయా కుటుంబాల్లోని అర్హులైన ఒక వ్యక్తికి స్టీల్ ప్లాంట్‌లో , ప్రభుత్వ పరంగా శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించాలని, వారి పిల్లల చదువుల బాధ్యతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందించడంతో పాటు, వారు పూర్తిగా కోలుకునే వరకు నెలకు రూ. 50 వేల జీవన భృతి కల్పించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడానికి మేము కృషి చేశాం .ఆ రోజు 28000 మంది పనిచేస్తుంటే ఈ రోజు 16000 మందే ఉన్నారు. కరెంటు బిల్లులు పెంచేశారు, బోనస్ లు, ఇన్సెంటివ్ లు ఆపేశారని ఆరోపించారు. ఇంత దారుణంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను ఈ కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెట్టారు, ఉక్కు కార్మికుల పరిస్థితిపై అందరూ ఆలోచించాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కార్మికుల పరిస్థితి ఎలా ఉంది, కూటమి హయాంలో ఎలా ఉందో అందరూ గమనించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వైఎస్సార్‌సీపీ అడ్డుకుందని జగన్ తెలిపారు. 2021 మార్చి 9న ప్రధాని మోదీకి లేఖ కూడా రాశామని గుర్తు చేశారు.ప్రభుత్వం స్పందించే వరకు వైఎస్సార్‌సీపీ తరపున బాధితుల పక్షాన పోరాటం ఆపేది లేదని జగన్ స్పష్టం చేశారు. తమ పార్టీ ఎల్లప్పుడూ కార్మికులకు, పేదలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రాజకీయాలు పక్కనబెట్టి బాధితుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలన్నారు. లోకేష్ పర్యటన సందర్భంగా జరిగిన వివాదంపై స్పందించారు. లోకేష్ లాంటి మనుషులు కూడా ఉంటారా అని జగన్ ఆశ్చర్యపోయారు.

# ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర

ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటినుంచి 1964 మే 27 వరకు జవహర్‌లాల్ నెహ్రూ పదవిలో కొనసాగారు. ప్రధాన మంత్రిగా నెహ్రూ పదవీకాలం మొత్తం 4,398 రోజులు. ఇక, మోదీ తొలిసారిగా 2014 మే 26న భారత ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి మోదీ నిరంతరాయంగా ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతుంది. నేటితో (2026 జూన్ 10) ప్రధానిగా మోదీ పదవీకాలం 4,399 రోజులకు చేరింది. దీంతో ఇప్పటివరకు దేశ చరిత్రలో అత్యధిక కాలం పాటు ప్రధానమంత్రి పదవిలో కొనసాగిన నెహ్రూ రికార్డును మోదీ అధిగమించారు.అయితే ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేసినప్పటికీ ఆమె పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. దీంతో 2014, 2019, 2024లలో వరుసగా మూడుసార్లు ఎన్డీయే విజయం సాధించడంతో నిరవధికంగా ప్రధానిగా కొనసాగుతున్న నేతగా మోదీ నిలిచారు. ప్రస్తుతం మోదీ 3.0 ప్రభుత్వం కొనసాగుతుండగా ఈ టర్మ్‌లో మరో మూడేళ్ల పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ప్రధని మోదీ ఇందిరా గాంధీ రికార్డును కూడా బ్రేక్ చేసి, దేశంలో అత్యధిక కాలం ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా నిలవనున్నారు.భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై నిరంతరాయంగా అత్యధిక కాలం పాటు ప్రధాన మంత్రిగా నిలిచిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ నాయకుల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రధాన మంత్రి చేపట్టిన పరివర్తనాత్మక పాలన, 'గ్లోబల్ సౌత్' (అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి) పక్షాన మోదీ చేస్తున్న కృషిని పలువురు నేతలు ప్రశంసించారు. అలాగే సమ్మిళిత, ఆర్థికంగా శక్తివంతమైన భారతదేశం పట్ల ఆయనకున్న దార్శనికతను మెచ్చుకుంటున్నారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయక 2026 జూన్ 8న రాసిన లేఖలో ప్రధాని మోదీకి శ్రీలంక ప్రభుత్వం, ప్రజల తరపున అభినందనలు తెలియజేశారు. "ఈ మైలురాయి కేవలం మీ పదవీకాలానికి మాత్రమే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని ప్రజలు మీ నాయకత్వంపై పదేపదే ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి నిదర్శనం" అని పేర్కొన్నారు.పాపువా న్యూ గినియా ప్రధాన మంత్రి జేమ్స్ మారపే కూడా ప్రధాని మోదీకి అభినందనలు తెలుపుతూ వీడియో సందేశం పంపారు. అందులో ప్రధాని మోదీని నాయకత్వానికి ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తిగా అభివర్ణించారు. 20 కోట్ల మందికి పైగా ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి, నేడు వారికి మంచి జీవితాన్ని అందించడం ఒక అద్భుతమైన ఘనత అని పేర్కొన్నారు.ట్రినిడాడ్, టొబాగో ప్రధానమంత్రి కమలా పర్సాద్-బిస్సెస్సర్ కూడా ప్రధానమంత్రి మోదీకి అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో ప్రపంచ అంశాలపై భారతదేశం ఒక ప్రముఖ స్వరంగా ఎదిగింది అని పేర్కొన్నారు.

# తెలంగాణలో మావోయిజం లేదు

అవగాహన కల్పించేందుకు యాంటీ నార్కోటిక్స్ అండ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం సీవీ ఆనంద్ పర్యటించారు. ప్రజా భద్రత, రోడ్డు భద్రత అవగాహన, మాదకద్రవ్యాల నియంత్రణ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అతిథి గృహంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో డీజీపీ పాల్గొని మొక్కలు నాటారు. ఆ తర్వాత చిల్డ్రన్ పార్క్‌ను ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు. గాంజా, డ్రగ్స్ లాంటి మారకద్రవ్యాలకి బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న అడిక్షన్ సెంటర్‌ని సందర్శించారు.

### సేఫ్ ఆదిలాబాద్ లక్ష్యంగా సమీకృత సీసీటీవీల ఏర్పాటు

ఆదిలాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమీకృత సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. నాందేడ్, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దుకు అనుసంధానంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల మధ్య వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత బలోపేతంలో సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. జిల్లా పోలీసులు చేసిన సీసీటీవీల ఏర్పాటును డీజీపీ అభినందించారు. హైదరాబాద్, సైబరాబాద్ నగరాల మాదిరిగా ఆదిలాబాద్ జిల్లాను కూడా సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను విస్తరించాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

### ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలి

రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వ్యక్తులకు పోలీసు...రవాణా శాఖల సహకారంతో లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రంగవల్లి పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ల విజేతలకు బహుమతులు అందజేశారు.

### సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లు

తెలంగాణ ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద సమస్యను విజయవంతంగా ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లుగా మారాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో 7,800 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక మరణాలను నివారించవచ్చని తెలిపారు.'వేగం ఉత్సాహాన్ని ఇవ్వొచ్చు, కానీ అదుపు కోల్పోతే ప్రాణాలను తీస్తుంది. ట్రాఫిక్ నిబంధనలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదు" అని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గాయని డీజీపీకి జిల్లా ఎస్పీ వివరించారు. గత సంవత్సరం జనవరి నుంచి మే వరకు 72 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, ఈ ఏడాది జనవరి – మే చివరి నాటికి సంఖ్య 48కు తగ్గిందని డీజీపీ చెప్పుకొచ్చారు. అవగాహన కార్యక్రమాలు, పోలీసు, రవాణా శాఖలు, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. 24 మంది ప్రాణాలు కాపాడటం అంటే 24 కుటుంబాలను విషాదం నుంచి రక్షించినట్టేనని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

### డ్రగ్స్ ప్రమాదాలపై హెచ్చరిక

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని డీజీపీ సీవీ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు.ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలు, దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలో లో నంబర్ 1 స్థానంలో పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ ప్రభావంతో 21 స్థానానికి పడిపోయింది. నేడు పంజాబ్ సామాజికంగా, ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. తెలంగాణ యువత అలాంటి పరిస్థితులు రాకుండా విద్య, ఉపాధి, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం వైపు దృష్టి సారించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

### సురక్షిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసి పనిచేయాలి

రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారుల వెంట భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, యాంటీ నార్కోటిక్స్ చర్యలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, యువత కలిసి పనిచేసినప్పుడే డ్రగ్స్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీజీ సీఐడీ ఉ ఏసీబీ చారు సిన్హా, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, తోష గ్రామ సర్పంచ్ పద్మ, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అమ్మకాలలో విస్కీదే టాప్

**హైదరాబాద్,** తెలంగాణ మద్యం విక్రయాల్లో అత్యధిక వాటా విస్కీదేనని గణాంకాలు చెబుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణలో మద్యం ప్రియులు.. విస్కీకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఇక త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ ప్రయత్నాలు చేస్తుండటంతో.. విస్కీ లవర్స్‌కు షాక్ తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం ధరల పెంపు ప్రతిపాదనలతో మందుబాబుల్లో తెలియని ఆందోళన నెలకొంది.తెలంగాణలోని ఏ వైన్స్, ఏ బార్‌లోకి వెళ్లినా విస్కీ అమ్మకాలే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా ఎండవేడిమిని తట్టుకునేందుకు మద్యం ప్రియులు.. చల్లని బీర్లు తాగుతున్నా.. విస్కీ అమ్మకాలే అత్యధికంగా ఉంటాయని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ మద్యం మార్కెట్‌లో విస్కీదే సింహభాగం ఉంటుంది. తక్కువ ధర బ్రాండ్ల మద్యం దగ్గరి నుంచి ఖరీదైన బ్రాండ్ల వరకు మందుబాబులు విస్కీకే ఓటేస్తున్నారు. మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో విస్కీ వినియోగం అత్యధికంగా ఉంది. ఇదే సమయంలో.. త్వరలోనే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో విస్కీ ప్రియుల జేబుకు చిల్లు తప్పదనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.2026లో మద్యం మార్కెట్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో అమ్ముడు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ వాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది.

దీంతో దేశంలోనే అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాందీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని ఐటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.తెలంగాణలో విస్కీ అంటే కేవలం మద్యం మాత్రమే కాదని.. సామాజిక జీవనంలో ఒక భాగమైపోయిన అలవాటు అని హైదరాబాద్‌కు చెందిన లిక్కర్ మార్కెట్ విశ్లేషకుడు ఒకరు చెప్పారు. అందుకే మద్యం ధరలు పెరిగితే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని కుటుంబాలు, రిటైల్ వ్యాపారులు, హాస్పిటాలిటీ రంగంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 శాతం ఉండగా.. రూ.140-160 ధరల విస్కీలు 21.07 శాతం అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270-రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళ్లు విస్కీయే కావడం విశేషం.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ తర్వాత బ్రాండీ నిలిచింది.

బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాండీకి భారీగా డిమాండ్ ఉండేది. అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి.మరోవైపు.. తెలంగాణలో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్‌కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గ చూపుతున్నారని తెలుస్తోంది.

# కంగ్రాట్స్ మోదీజీ



## - నెహ్రూ రికార్డు బ్రేక్ చేసిన మోదీ - వివిధ దేశాల నుంచి ప్రశంసలు

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహార్ లాల్ నెహ్రూ పేరిట ఉన్న అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానమంత్రి పదవిలో కొనసాగిన రికార్డును అధిగమిస్తూ మోదీ కొత్త చరిత్ర సృష్టించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధాన మంత్రిగా ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను ఆయన తిరగరాశారు. నెహ్రూ 4,398 రోజుల పాటు ప్రధానిగా కొనసాగగా, మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకుని ఈ మైలురాయిని అధిగమించారు. ఈ ఘనతతో భారత రాజకీయ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా మోదీ తన స్థానాన్ని మరింత బలపరుచుకున్నారు. వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ఆయన, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కాలం ఎన్నికైన ప్రధానిగా కొనసాగిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

### చరిత్రలో నిలిచిన మైలురాయి

భారతదేశ రాజకీయ, పరిపాలనా చరిత్రలో 2026 జూన్ 10 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబోతుంది. 2014 మే 26న తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇప్పటి వరకు నిరాఘాటంగా ఆ పదవిలోనే ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తగా బీజేపీ ప్రభంజనం సృష్టించి.. మోడీ ప్రధాని అయ్యే అవకాశం కల్పించింది. 2024లో బీజేపీకి ఒంటరిగా సీట్లు తగ్గినప్పటికీ.. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, జనసేన సహా.. అనేక చిన్నా చితకా పార్టీల మద్దతుతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అలంకరించారు. నెహ్రూ స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా గుర్తింపు పొందగా, మోదీ ఆధునిక భారత అభివృద్ధి, డిజిటల్ మార్పులు, ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను పెంచిన నాయకుడిగా తన ముద్ర వేశారు. ఈ నేపథ్యంలో నెహ్రూ రికార్డును అధిగమించడం రాజకీయంగా, చారిత్రకంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత, జూన్? 9,2024న మోడీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రెండవ పదవీకాలం 2019 మే 30న ప్రారంభమైంది. గతంలోనూ మూడు సార్లు ప్రధాని అయిన వారు ఉన్నా.. వరుసగా.. ప్రధాని కావడం, సుదీర్ఘకాలం వరుసగా పాలన సాగించే విషయాల్లో మోడీనే ఫస్ట్ నిలిచారు. 2014, మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ ఈ నెల 10వ తేదీ నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు. 1952.. మే 13న దేశ తొలి ప్రధానిగా నెహ్రూ ప్రమాణం చేశారు. ఆయన 1964, మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోడీ తోసిపుచ్చి. సరికొత్త రికార్డును సృష్టించారు. 2026 జూన్? 10 నాటికి మోడీ 4,399 రోజులపాటు వరుసగా పీఎం సీటులో కూర్చున్న ఏకైక నేతగా నిలిచారు. 2025, జులై 25న 4,078 రోజుల నిరంతరాయ పాలన రికార్డుతో మోదీ ఇందిరాగాంధీ రికార్డును బద్దలు కొట్టారు. ఇందిరా గాంధీ మధ్యలో ఓ సారి ఓడినా 4077 రోజులు పీఏం గా దేశాన్ని పాలించారు. అయితే ఈ రికార్డును మోదీ గత ఏడాదే దాటేసీ.. ఈ ఏడాది నెహ్రూను అదిగమించారు.

### మోదీకి ఇతర దేశ నేతల అభినందనలు

అగ్రరాజ్యమైన అమెరికా సెనేటర్లు మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. 2014 నుంచి ప్రధానిగా కొనసాగుతున్న మోదీ భారత్? ప్రతిష్టను పెంచారని వారు కొనియాడారు. ఈ విషయంపై స్పందించిన అమెరికా సెనేటర్ జాన్ కార్నిన్ మోదీకి అభినందనలు తెలిపారు. "140 కోట్ల ప్రజల నమ్మకాన్ని మూడుసార్లు గెలుచుకుని, 4,399 రోజులుగా ప్రధానిగా కొనసాగుతున్న మోదీకి అభినందనలు. ఆయన పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. భారత్-అమెరికా భాగస్వామ్యం ఎన్నడూ లేనంత బలంగా ఉంది" అని కార్నిన్ అన్నారు. అమెరికన్ గాయని మేరీ మిల్బెన్? దీనిని చారిత్రక ప్రజాస్వామ్య మైలురాయి'గా అభివర్ణించారు. ఈ రికార్డుపై ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మిమ్మల్ని రోమ్?లో మరోసారి కలవడం సంతోషన్నా కలిగించిందని ఆమె అన్నారు. మోదీకి అభినందనగా కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మాణం ఆమోదించింది. కేబినెట్ సభ్యులంతా నిలబడి చప్పట్లతో మోదీకి అభినందనియాలు తెలియజేశారు. ఏపీ తెలంగాణ బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలంగాన బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారలోకేష్? లు కూడా మోదీకీ కృతజ్ఞతలు తెలిపారు.

### మోదీ నాయకత్వంలో ప్రధాన మార్పులు

గత పన్నెండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలను అమలు చేసింది. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్వచ్ఛ భారత్, జన్ ధన్ యోజన, ఉజ్వల యోజన వంటి పథకాలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రభావాన్ని చూపాయి. అదేవిధంగా జీఎస్టీ అమలు, ఆర్టికల్ 370 రద్దు, కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణం, మౌలిక సదుపాయాల విస్తరణ, రైల్వేలు మరియు రహదారి రంగాల్లో భారీ పెట్టుబడులు వంటి చర్యలు మోదీ పాలనలో చోటుచేసుకున్న ప్రధాన పరిణామాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### అంతర్జాతీయ వేదికపై భారత్

విదేశాంగ రంగంలో కూడా మోదీ నాయకత్వంలో భారత్ ప్రభావం పెరిగిందని కేంద్ర ప్రభుత్వం తరచుగా పేర్కొంటోంది. జీ-20 సదస్సు నిర్వహణ, ప్రపంచ దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు, పెట్టుబడుల ఆకర్షణ, భారతీయ ప్రవాసులతో సంబంధాల బలోపేతం వంటి అంశాలు ఆయన పాలనలో ప్రాధాన్యం పొందాయి. ప్రపంచ వేదికపై భారతదేశాన్ని మరింత ప్రభావవంతమైన దేశంగా నిలబెట్టడంలో మోదీ కీలక పాత్ర పోషించారని బీజేపీ నాయకులు చెబుతున్నారు. మరోవైపు, ప్రతిపక్షాలు మాత్రం ఆయన పాలనపై పలు అంశాల్లో విమర్శలు కూడా గుప్పిస్తున్నాయి. అయినప్పటికీ ప్రజల మద్దతుతో వరుసగా మూడు సార్లు అధికారంలోకి రావడం ఆయన రాజకీయ బలాన్ని ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### రాజకీయ ప్రాధాన్యం

నెహ్రూ రికార్డును అధిగమించడం కేవలం గణాంక పరమైన విషయం మాత్రమే కాదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇది స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ పరిణామాల్లో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని చెబుతున్నారు. దేశ రాజకీయాల్లో నాయకత్వ స్థిరత్వం, ప్రజల విశ్వాసం, ఎన్నికల విజయాల పరంపర వంటి అంశాలకు ఈ రికార్డు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. 4,399 రోజులు ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతూ నరేంద్ర మోదీ భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించడం ద్వారా ఆయన దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. ఈ ఘనతపై బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, రాజకీయ వర్గాల్లో ఈ అంశం విస్తృత చర్చకు దారితీసింది. రాబోయే రోజుల్లో ఈ రికార్డు మరింత పొడవుగా కొనసాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



అమీనా కలందర్ కవి రత్న సీనియర్ జర్నలిస్ట్.

### తాడిపత్రి పట్టణంలో

# ఈనెల 12న వైసీపీ నిరసన

**- పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి..**



**తాడిపత్రి** తాడిపత్రి పట్టణంలో ఈనెల 12న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నారు. వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు పట్టణ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గ వైసీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో ఈనెల 12న వైసిపి కార్యాలయం నుండి వైయస్సార్ సర్కిల్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టనున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కావున నియోజకవర్గ వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన వైసిపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి వైసిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాబర్ట్, ఎర్రగుంట్లపల్లి వై నాగేశ్వర్ రెడ్డి, బోడాయిపల్లి ఆర్ సి ఓబుల్ రెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో దుమ్ము దుమారం

**- ప్రయాణికులకు ఇబ్బందులు**



**బద్వేలు** బద్వేల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో దుమ్ము సమస్య తీవ్రంగా మారింది. బస్సులు రాకపోకలు సాగించే ప్రాంతంలో రోడ్డు దెబ్బతిని మట్టి, బయటకు రావడంతో వాహనాలు తిరిగిన ప్రతిసారీ భారీగా దుమ్ము లేస్తోంది. దుమ్ము కారణంగా ప్రయాణికులు, వ్యాపారులు, బస్టాండ్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు శ్వాస సంబంధిత సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేపట్టాలని, తరచూ నీటిని చల్లే ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# కార్యకర్తలకు ఆశలు ఆకాంక్షలునీ డవా

**- కేవలం పార్టీ సేవలకేనా కార్యకర్తల అవసరము**

**పోరుమామిళ్ల ( బి కోడూర్ ).** కార్యకర్త అనేవాడు ఎన్ని సంవత్సరాలైనా చకోర పక్షుల్లాగా అధికారం వచ్చేదాకా తగు సమయం కోసం కాపలా కాస్తారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేస్తాడు అలాగని తొందరపడకుండా వచ్చేదాకా వెయిట్ చేస్తాడు అధికారంలోకి వచ్చాక తిరిగి చూసుకుంటే 5ఏళ్ళు అయిపోతుంది మనం ఎక్కడున్నామో అని ఆలోచించుకునే లోపే 5ఏళ్ళు పూర్తి అవుతాయి ఇంకేముంది మళ్లీ ఎన్నికలు తెగించి పోరాటం పార్టీ కోసం పని చేయటం. కార్యకర్తలకు కూడా ఆశలు ఆకాంక్షలు గొప్పగా ఉంటాయి అన్ని నెరవేరకపోయినా కొన్ని సాధించుకునేందుకు ప్రయత్నం చేస్తాడు ఆ సమయంలో బంధువుల నెపంతోనూ కులం నెపంతోనూ పరపతి వలన కార్యకర్తకు పని జరగకుండా చేస్తే ఆ సమయంలో వానికి వచ్చే కోపం అంతా ఇంతా కాదు బయటపడడు అలాగని మరో పార్టీలోకి వెళ్ళలేడు నరకం అనుభవిస్తారు. అప్పుడే పార్టీపై ద్వేషం పెంచుకొని మరో పార్టీకి సహకరించక పోయిన నాకెందుకులే అంటూ అన్ని మూసుకొని ఉండిపోతాడు. అలా కార్యకర్తలు ఉండిపోతే ఏ పార్టీ మనుగడ కూడా సాగించలేదు ఏ నియోజకవర్గ స్థాయి నాయకుడు పోలింగ్ బూతులు మేనేజ్ చేయలేడు ఆయా గ్రామాల్లో నాయకులు కేవలం ఒకరిద్దరే ఉంటారు పంచాయతీలో పోలింగ్ బూతుల్లో కార్యకర్త చేసే సాహసం నాయకులు చేయలేడు దీంతో పార్టీ బలహీనమై ఓటమికి దారి తీస్తుంది రెండేళ్లుగా కార్యకర్తలు రగిలిపోతున్న వారికి రూపాయి పని కూడా చేసింది కూడా లేదు పార్టీకి కార్యకర్త లే బలం ఇది తెలుగుదేశం కార్యకర్తల పార్టీ అంటూ నారా లోకేష్ చెప్తుంది బాగానే ఉన్నా కిందిస్థాయిలో కార్యకర్తలు తీవ్రమైన అసమ్మతితో ఉన్నారు ఒక్కసారి ఎమ్మెల్యే దగ్గరకు ఇన్చార్జి దగ్గరకు కార్యకర్త వెళ్లి పని చేయించుకోలేకపోతే గతంలో లాగా కాకుండా సిగ్గుతో అటువైపు వెళ్లడానికి కూడా ఇష్టపడకుండా ఇంటి దగ్గరే ఉండిపోతున్నారు. ప్రస్తుతం బద్వేల్ నియోజకవర్గంలో బిఎల్ ఏ లను నియమించే పనిలో పార్టీ బిజీగా ఉంది . గత రెండేళ్లుగా పార్టీ అధికారంలో ఉన్న ఈ చిన్న పని జరగకపోవడంతో బిఎల్ఏ నియామకాలపై అసంతృప్తిగా ఉన్నారు అధికారంలో ఉండి పనులు జరగనప్పుడు ఎందుకీ పదవులు అంటూ బి ఎల్ ఎ ల నియామకంపై ముగ్గు చూపడం లేదు. గత 15 ఏళ్లుగా పార్టీలో వేరే పార్టీల నుంచి ఎమ్మెల్యేలు తెదేపాలో చేరటం వచ్చినవారు వైసిపి కార్యకర్తలకు పనులు చేయటం ఇలా అసలైన కార్యకర్త నరకం అనుభవిస్తూనే ఉన్నారు. పార్టీ ఈ విషయాన్ని గుర్తు ఎరగకపోతే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలు బాగుండాలని భారతీయ జనతా పార్టీ ప్రత్యేక పూజలు

**రాజన్న సిరిసిల్ల** భారతీయ జనతా పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ భారతదేశ చరిత్రలోనే అత్యధిక రోజులు (4399) భారతదేశానికి సేవలందించిన ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోతున్న సందర్భంగా మరియు దేశానికి అహర్నిశలు సేవలందిస్తూ వరుసగా 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా విజయవంతంగా పాలన సాగిస్తున్న గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు మరియు దేశాభివృద్ధి కోసం రామోజీపేట గ్రామంలోని శ్రీ సీతరామచంద్రుల దేవాలయం లో పూజ, అర్చన కార్యక్రమం చేయడం జరిగింది.

భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా మోడీ గారి నాయకత్వం మరింత బలోపేతం కావాలని భగవంతుని ప్రార్థించారు. సేవే లక్ష్యంగా 12 ఏళ్ల సుపరిపాలన అందించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ విజయవంతమైన పాలన కొనసాగాలని కోరుతూ రామాలయంలో అర్చనలు నిర్వహించడం జరిగింది. మోడీ గారి నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి, ఆత్మనిర్భరత మరియు ప్రపంచ గౌరవం వైపు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్, మండలం ఉపాధ్యక్షులు కూనబోయిన బాలరాజు మండల ప్రధాన కార్యదర్శి కారిక నవీన్ గూడెపుపల్లి సర్పంచ్ గుడెల్లి స్వప్న భాస్కర్, రామోజీపేట మాజీ సర్పంచ్ పెండ్యాల మేఘవ్వ, సీనియర్ నాయకులు అమ్ముల అశోక్ మండల కార్యవర్గ సభ్యులు పలమూరు రవి, దండ్ల సురేష్ కార్యకర్తలు రేగుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

## కొలిమిగుండ్లలో నందమూరి బాలకృష్ణ

# జన్మదిన వేడుకలు



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 66వ జన్మదిన వేడుకలను టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. మూలే రామేశ్వర్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కొలిమిగుండ్ల మండలంలోని టిడిపి నాయకులు బూతు లెవెల్ ఏజెంట్లతో టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ నమోదు ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కోటపాడు శివరామిరెడ్డి, గొంగటి హుస్సేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, తోట అమర్నాథ్ రెడ్డి, తోట నాగ మల్లారెడ్డి, కళ్యాణ్ రెడ్డి, లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, అంబటి జయలక్ష్మి రెడ్డి, అంబటి వివేక్ రెడ్డి, అంబటి ప్రకాశ్ రెడ్డి, మందా విజయ్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో 1200 మంది

# మరణాలకు కాంగ్రెస్ పార్టీనే కారణం

**కూకట్ పల్లి** తెలంగాణ ఉద్యమంలో 1200 మంది మరణాలకు కాంగ్రెస్ పార్టీనే కారణమని తెలంగాణ జనసేన నాయకులు ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని జనసేన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. పవన్ కళ్యాణ్ ప్రాంతీయవాదాన్ని వ్యతిరేకించలేదని, ప్రాంతీయ ఉద్దేశాలు ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని మాత్రమే వ్యాఖ్యానించారని తెలిపారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన అభిప్రాయమని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారికి కాంట్రాక్టులు ఇవ్వొద్దని చెబుతున్నారు. అయితే ఆంధ్ర ప్రాంత ప్రజలతో ఉన్న మీ కుటుంబ సంబంధాల విషయమై ఏమి చెబుతారు, అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను ఖండిస్తూ, పాత కరీంనగర్ జిల్లాలోని భూములు కుటుంబ సభ్యుల పేర్లపై ఎలా నమోదయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆస్తులు, వ్యాపారాలు ఎంత మేర పెరిగాయో ప్రజలకు వివరించాలని కోరారు. ఇసుక, బొగ్గు, బూడిద వ్యాపారాలపై కూడా ఆరోపణలు చేశారు. అనిరుధ్ రెడ్డి సమైక్యవాద అంశాన్ని ప్రస్తావించడం సరికాదని హెచ్చరించారు. జూన్ 2న నిర్వహించాలనుకున్న జనసేన సభకు అనుమతులు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై స్పందిస్తూ, గత పదేళ్ల పాలనకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వస్తాయనే భయంతో పవన్ కళ్యాణ్ సభను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో జనసేన పార్టీ బలంగా పోటీ చేస్తుందని నాయకులు తెలిపారు

## రెండేళ్ల ఎన్డీఏ పాలనలో

# రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి

**- అభివృద్ధికి ప్రతీక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..**

**- అన్న ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంతోనే రాష్ట్రంలో సంక్షేమానికి నాంది..**

**- డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి**

**బద్వేలు** రెండేళ్ల ఎన్డీఏ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించిందని, అభివృద్ధికి ప్రతీకగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిని పొందారని, తెలుగు ప్రజలందరూ అన్నగా పిలుచుకునే మహనీయుడు ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలనకు పునాది పడిందని బుధవారం బద్వేల్ లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్ల ఎన్డీఏ పాలనలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు.

అభివృద్ధి, గ్రామ, గ్రామాన రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, టూరిజం అభివృద్ధి, నూతన విద్యుత్ సబ్స్టేషన్ల ఏర్పాటు తదితర అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామ, గ్రామాన రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి, నూతన విద్యుత్ సబ్స్టేషన్ల ఏర్పాటు తదితర అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పింఛన్లు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు పథకం, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న చేయూత మొదలైన సంక్షేమ పథకాల గురించి వివరించి, లబ్ధిదారుల అనుభవాలను తెలుసుకున్నారు. ఇటు సంక్షేమం, అటు అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్తామన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నట్లు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు పత్రికా విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు

## హోటల్ యజమానులు వజ్ర అన్వేషకులకు

# బస వసతులు కల్పించరాదు

**- ఎస్సై మల్లికార్జున**

**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామ సరిహద్దులలో గల హోటల్ యజమానులకు జొన్నగిరి ఎస్సై మల్లికార్జున బుధవారం రోజున కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వజ్రాల అన్వేషణ కొరకు వచ్చిన ప్రజలు హోటళ్ల నందు వసతులను కల్పించడం ద్వారా వారు నెలల తరబడి ఇక్కడే ఉంటూ పంట పొలాలలో తిరుగుతూ పంటలను తీవ్రంగా నష్టపరిచి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎస్సై తెలియజేశారు. ఇలా రైతులకు నష్టం జరగడం ద్వారా హోటల్ యజమానులు కూడా పరోక్షంగా కారణమవుతున్నారని ఎస్సై హోటల్ యజమానులకు తెలియజేశారు.

అదేవిధంగా హోటల్ నందు ఏటువంటి ఆసాం ఘిక కార్యకలాపాలను చోటు ఇవ్వకుండా హోటల్ వ్యాపారాన్ని సజావుగా చేసుకోవాలని ,ఏవైనా ఆసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జున వారిని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్రం నలుమూలల నుండి వస్తున్న వజ్ర అన్వేషకులు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి ఇక్కడికి వచ్చి తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండాలని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమానులు, జొన్నగిరి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచలోహ గరుడ విగ్రహాన్ని దొంగిలించాడు
# స్వచ్ఛందంగా ఒప్పుకున్నాడు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితుడు చైతన్య మణికంఠను కస్టడీలోకి తీసుకొని విచారించగా, అతడు తన సహచరులతో కలిసి తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగళ్ళపల్లి గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాగశాల నుండి 22-01-2026 తేదీన దేవస్థానం నుండి పంచలోహ గరుడ విగ్రహాన్ని దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి స్వచ్ఛంద ఒప్పుకోలు మేరకు వేములవాడ మండలం తేటకుంట ఇందిరనగర్ (అగ్రహారం) గ్రామంలోని అతని నివాసం వద్ద దాచిపెట్టిన పంచలోహ గరుడ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పంచలోహ గరుడ విగ్రహం సుమారు 15 నుండి 20 కిలోల బరువు కలిగి ఉండి, దాని విలువ సుమారు రూ.30,000/- వరకు ఉంటుందని అంచనా వేయబడింది. ఈ కేసును ఛేదించి, దొంగిలించబడిన పంచలోహ గరుడ విగ్రహాన్ని స్వాధీనం చేసుకోవడంలో విశేష కృషి చేసిన తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ ఐ ఉపేంద్ర చారి, ఏఎస్ఐ జాన్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పోలీస్ కానిస్టేబుళ్ళు సంపత్, శ్రావణ్‌లను సిరిసిల్ల సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డిపిఒ) కె.నాగేంద్ర చారి కె. నాగేశ్వర రావు సీఐ, సిరిసిల్ల రూరల్ అభినందించారు. వారి చొరవ, నిబద్ధత, సమర్థవంతమైన దర్యాప్తు ఫలితంగానే కేసు త్వరితగతిన ఛేదించబడిందని కొనియాడారు. ప్రజలు దేవాలయాలు ఇతర ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డి.ఎస్.పి కె.నాగేంద్ర చారి కోరారు.

## దుబాయ్ ప్రమాద బాధితుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం

- మృతదేహాల తరలింపునకు స్వయంగా దుబాయ్‌కి పయనం
- బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేసిన ఎమ్మెల్యే సత్యం - ప్రజల హర్షం



చొప్పదండి / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా వాసుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం స్వయంగా దుబాయ్‌కి బుధవారం బయలుదేరారు. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన తెలంగాణ గల్ఫ్ కార్మికులు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు మృతి చెందగా, వారిలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు ప్రవాస కార్మికులు ఉన్నారు. మృతుల్లో కొడిమ్యాల మండలం, నమికొండ గ్రామానికి చెందిన సయ్యద్ సలీం (51), మల్యాల మండలం, తక్కల్లపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి తిరుపతి గౌడ్ (42), మెట్‌పల్లి మండలం, గాజులపేటకు చెందిన అబ్బుల్ రఫీక్ (37) ఉన్నారు. వీరితో పాటు ప్రమాదంలో గాయపడిన చొప్పదండి నియోజకవర్గానికి చెందిన క్షతగాత్రులను కూడా స్వదేశానికి తీసుకురావడానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మృతుల కుటుంబాల విజ్ఞప్తి మేరకు డా. మేడిపల్లి సత్యం స్వయంగా దుబాయ్ వెళ్లి అక్కడి భారత కాన్సులేట్ అధికారులతో సమన్వయం చేస్తూ మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. విదేశాల్లో కష్టపడి పనిచేస్తున్న తెలంగాణ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా దుబాయ్ వెళ్లి మృతదేహాల తరలింపునకు చర్యలు చేపట్టడం పట్ల బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

- ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది
- కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నేత : తెడ్డు అశోక్
- లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామంలో బుధవారం కళ్యాణ లక్ష్మీ పథకం కింద లబ్ధిదారులు తంబర్ లింబన్న, బాయికడి రాజులకు చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భీంగల్ మండల సీనియర్ నాయకులు తెడ్డు అశోక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామధ్యక్షులు మురారి, నాయకులు కోరాడి లింబాద్రి, బద్ది అవినాష్, సర్పంచ్ శ్రీనివాస్, కిష్టా గౌడ్, అరుణ్, దశగౌడ్, జీప్ రాజన్న, తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తమిళనాడులో మహిళలకు రక్షణగా శివంగులు

**చెన్నై, జూన్** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నెల రోజులకు విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల రక్షణ కోసం సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కానిస్టేబుల్ మొదలు ఐజీ స్థాయి అధికారి వరకు అందరూ మహిళా పోలీసులే ఉంటారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారు మహిళల కోసం ప్రత్యేకంగా దిశ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన తరహాలోనే.. దానికి మరింత అప్డేట్‌గా ఈ టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందని భావిస్తున్నారు. తమిళనాడులో శాంతి భద్రతలపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ.. మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సీఎం విజయ్ కీలక ముందడుగు వేశారు. సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. తమిళనాడు సీఎంగా ప్రమాణం చేసిన సరిగ్గా నెల రోజులకు విజయ్ ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం విశేషం. స్త్రీలు, బాలికల భద్రత కోసం ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ విభాగం పని చేస్తుంది. సింగప్పెన్ అంటే తమిళంలో సింహం లాంటి అమ్మాయి అని అర్థం. ఈ టాస్క్‌ఫోర్స్ విభాగంలో కానిస్టేబుల్ నుంచి ఐజీ స్థాయి వరకు అందరూ మహిళా పోలీసులే ఉంటారు. ఈ విభాగంలో పని చేసే వారికి మార్షల్ ఆర్ట్స్‌తోపాటు ఆయుధాల వినియోగం, బైక్ నడపడంపై శిక్షణ ఇస్తారుమహిళలపై వేధింపులు జరిగే కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు లాంటి రద్దీ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా నేరాలు జరగకుండా ఈ టాస్క్‌ఫోర్స్ చూస్తుంది. ప్రత్యేకమైన యూనిఫామ్‌లో సింగప్పెన్ మహిళా పోలీసులు బైకులపై రోడ్ల మీద తిరుగుతుంటారు. దీని వల్ల ఆకతాయిలు భయపడతారు. మహిళలు స్వేచ్ఛగా సంచరించడానికి అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వీరు మఫ్టీలో సాధారణ మహిళల్లా తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో పని చేసే వారికి బాడీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్ వాహనాలను అందిస్తారు. మహిళా హెల్ప్ లైన్ నంబర్లు లేదా అత్యవసర కాల్ నంబర్‌కు వచ్చే కాల్స్‌ను ఈ టాస్కోఫోర్స్ కంట్రోల్ రూమ్ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సింగప్పెన్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'ఈ టాస్క్‌ఫోర్స్ నా హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. తమిళనాడులోని ప్రతి కుటుంబాన్ని రక్షించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది. మహిళల రక్షణకు, మన కుటుంబాల భద్రతకు కట్టుబడి ఉన్నాం. ఇది కేవలం ఎన్నికల హామీ కాదు.. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం ద్వారా కీలక ముందడుగు వేశాం. డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ అనే మూడు అంశాలపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. తమిళనాడును పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చాలి. గతాన్ని తవ్వుకుంటూ కూర్చోవాలని మేం అనుకోవడం లేదు. సురక్షిత భవిష్యత్తును అందించడంపైనే మా ఫోకస్ ఉంది. మహిళలపై నేరాలను ఏమాత్రం సహించబోం. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఆ శిక్షలు చూశాక, నేరాలు చేయాలంటే ఇతరులు భయపడేలా చేస్తాం' అని విజయ్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ శివార్లలో 'దిశ' ఘటన జరిగిన తర్వాత ఏపీలో ఆ సమయంలో అధికారంలో ఉన్న జగన్ సర్కారు మహిళల రక్షణ కోసం దిశ చట్టం తీసుకొచ్చి.. రాష్ట్రవ్యాప్తంగా దిశ పేరిట మహిళా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దిశ యాప్‌ను సైతం నాటి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే లేదా ఫోన్‌ను గట్టిగా ఊపితే బాధితురాలి లైవ్ లొకేషన్ సమీపంలోని దిశ పోలీసు స్టేషన్‌కు, కంట్రోల్ రూమ్‌కు చేరేలా రూపకల్పన చేశారు. తమిళనాడులోని విజయ్ సర్కారు తీసుకొచ్చిన సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కూడా ఇదే తరహాలో ఉంటుంది. మహిళలపై నేరాలు జరగకుండా చూసే విషయంలో దిశతో పోలిస్తే ఈ టాస్క్‌ఫోర్స్‌ను కొంత మెరుగుపర్చారు.

# కాళ్ల బేరానికి టర్కీ..

**న్యూఢిల్లీ,** టర్కీ మొన్నటి దాకా పాకిస్తాన్ కు వంత పాడింది. అంతటి భూకంపం లో కూడా భారత్ సహాయం చేస్తే ఆ విషయాన్ని కూడా మర్చిపోయి.. జమ్ము కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ను విపరీతంగా సపోర్ట్ చేసింది. అంతర్జాతీయ వేదికలలో పాకిస్థాన్ దేశాన్ని వెనకేసుకొచ్చింది. మన దేశం మీద లేనిపోని విమర్శలు చేసింది. వీటన్నిటినీ కూడా భారత్ నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయింది. టర్కీ మాదిరిగా అరవలేదు.. అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడలేదు. భారత్ మీద ఇష్టానుసారంగా మాట్లాడి.. పాకిస్తాన్ దేశానికి వంత పాడిన టర్కీకి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతోంది. మధ్య ఆసియాలో యుద్ధాలు.. ఆర్థికంగా ఒత్తిడి.. పర్యాటక రంగంపై తీవ్రమైన ప్రభావం.. ఇవన్నీ కూడా టర్కీ దేశాన్ని తీవ్రమైన ఆలోచనలో పడేశాయి. ఇన్నాళ్లపాటు భారతదేశంతో విరోధం కొనసాగించిన టర్కీ ఇప్పుడు ఆకస్మాత్తుగా స్నేహం గుర్తుకొచ్చింది. అందువల్లే భారతదేశంతో మిత్రమా రా.. నాతో చేతులు కలుపు అన్నట్టుగా సంకేతాలు ఇస్తుంది. అయితే దీనిని భారత్ సరిగా పట్టించుకోవడం లేదు. టర్కీ బుద్ధి వచ్చేలా చేసేందుకు భారతదేశం గట్టిగా అరవలేదు.. ప్రపంచ వేదికల ముందు పిచ్చిపిచ్చిగా మాట్లాడలేదు. కేవలం లెక్కలు మాత్రమే వేసింది. ఆ లెక్కలు టర్కీ మొత్తాన్ని కదిలించాయి. లేని భూకంపాన్ని తెప్పించాయి. దీంతో టర్కీ కి ఇండియా అంటే ఏంటి.. నరేంద్ర మోడీ అంటే ఏంటో తెలిసింది. అందువల్లే కాళ్ళ బేరానికి వచ్చింది. చైనాలో యుగర్ ముస్లింల మీద దాడి చేస్తుంటే టర్కీ మాట్లాడలేదు. ఇరాన్, యోమన్, ఇరాక్ దేశాలలో ముస్లింలు చనిపోతుంటే టర్కీ మాట్లాడలేదు. కానీ కాశ్మీర్ విషయంలో మాత్రం గొంతు సవరించుకుంది. భారతదేశం మీద విష ప్రచారం చేసింది. భారత్ సైలెంట్ గా ఆర్మీనియా వైపు నడిచింది. సైప్రస్ మీద దృష్టి సారించింది. అంతేకాదు అత్యంత ఆధునికమైన ఆయుధాలను ఈ రెండు దేశాలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో భారత్ తనకు తెలియకుండానే తనకింద మంట పెడుతుందని టర్కీ కి అర్థమైంది. అందువల్లే ఇన్నాళ్లపాటు సాగించిన విరోధాన్ని.. శత్రుత్వాన్ని మర్చిపోయింది. స్నేహ హస్తాన్ని చాచింది. టర్కీని భారత్ నమ్మదు. అంతటి భూకంపం వచ్చినప్పుడు ప్రపంచ దేశాలు నిశ్శబ్దంగా ఉన్నప్పుడు భారత్ మాత్రమే టర్కీలో సహాయం చేసింది. మందుల నుంచి మొదలుపెడితే ఆహారం వరకు సరఫరా చేసింది. ఇవన్నీ మర్చిపోయి టర్కీ పాకిస్తాన్ దేశానికి జై కొట్టింది. దీనిని మనసులో పెట్టుకున్న భారత్ ఆర్మీనియా, గ్రీస్, సైప్రస్ దేశాలతో మాట్లాడింది. డిఫెన్స్ సహకారం పెంచింది.. ఫలితంగా టర్కీకి దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఆకాష్ యాంటీ మిస్సైల్ సిస్టమ్స్.. ఫినాక రాకెట్ లాంచర్స్.. స్వాతి రాడార్లు.. బ్రహ్మోస్.. ప్రళయ్ మిస్సైల్స్.. ఇవన్నీ కూడా ఇచ్చేస్తోంది. దీంతో టర్కీ అన్ని మూసుకుంది. నాతో కలువు అంటూ భారతదేశానికి సంకేతాలు పంపిస్తోంది. టర్కీ మాటలు భారత్ వింటుందా నెవర్.. ఎందుకంటే ఆ దేశం పాము లాంటిది.. పాలు పోసినా సరే విషమే చిమ్ముతుంది.

## సూర్యప్రభపై సారంగపాణిగా భక్తులను కటాక్షించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు

- దివ్య తేజోమయ రూపంలో స్వామివారి దర్శనం



**నారాయణవనం** నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం ఉదయం స్వామివారు సారంగపాణి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. సూర్యకిరణాల తేజస్సును తలపించే ఈ వాహనసేవలో స్వామివారి అపూర్వ రాజసం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. కర్పూరహారతులతో మార్మోగిన నారాయణవనంస్వామివారి విహార మార్గమంతా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్ర మాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సూర్యనారాయణుని మహిమను చాటిన సూర్యప్రభ వాహనంసకల జీవరాశులకు చైతన్యాన్ని ప్రసాదించే సూర్యుడు ఆరోగ్యప్రదాత, జీవనాధారం. సూర్యమండల మధ్యలో విరాజిల్లే శ్రీమన్నారాయణుడే సూర్యనారాయణుడని శాస్త్రాలు పేర్కొంటాయి. ఈ మహాతేజోమయమైన సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సత్సంతాన ప్రాప్తి కలుగుతాయని పురాణాలు విశదీకరిస్తున్నాయి.

# సంక్షేమ హాస్టల్స్

## డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ రుసుములు పెంపు

**హైదరాబాద్,** దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లో రూ.110 కోట్లతో పది అంతస్తుల అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు భోజన రుసుములను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచుతూ ప్రతి నెలా నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సన్నద్ధం చేసేలా విద్యా సాధికారత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో రూ.110 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ అనేది కేవలం ఇటుకలు, సిమెంట్‌తో కట్టే సాధారణ భవనం కాదని, కోట్ల మంది దళిత, గిరిజన, వెనుకబడినవర్గాల యువత భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దే ఒక విజ్ఞాన క్షేత్రమని అభివర్ణించారు. అధునాతన హంగులతో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల భారీ నిర్మాణంగా ఈ టవర్‌ను రూపుదిద్దనున్నట్లు వెల్లడించారు. ఈ భవనంలో అంతర్జాతీయ స్థాయి డిజిటల్ లైబ్రరీలు, అత్యాధునిక ఈ-లెర్నింగ్ సెంటర్లు, ఉన్నత విద్యా పరిశోధన విభాగాలు, సివిల్స్, ఇతర పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కేంద్రాలు, అంతర్జాతీయ సెమినార్ల కోసం కాన్ఫరెన్స్ హాళ్లు, నిపుణులతో కెరీర్ గైడెన్స్ యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పేద విద్యార్థులు ఖరీదైన కోచింగ్‌ల కోసం హైదరాబాద్‌కు వచ్చి ఇబ్బంది పడకుండా తమ సొంత జిల్లాల పరిధిలోనే శిక్షణ పొందేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు ఇక నుంచి ప్రతి నెలా డైట్, కాస్మెటిక్ రుసుములను బకాయిలు లేకుండా సకాలంలో విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి హామీ ఇచ్చారు. గత పదేళ్ల భారాస పాలనలో విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించిన ఆయన.. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా తమ ప్రభుత్వం భోజన రుసుములను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టామని ఇందులో భాగంగానే నింబోలిఅడ్డాలోని చారిత్రాత్మక ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నట్లు తెలిపారు

# పెట్రోల్ ఎఫెక్ట్...

## పిల్లలపై ట్రాన్స్ పోర్టు చార్జీల భారం

**హైదరాబాద్** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం స్కూల్ విద్యార్థులపైనా పడుతోంది. యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ నేపథ్యంలోనే పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోలు, ప్రైవేటు కార్లు కూడా ధరలు పెంచేస్తున్నాయి. ఇక త్వరలోనే స్కూళ్లు ప్రారంభం కానుండగా.. విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులను ఆయా వాహనదారులు పెంచేస్తున్నారు. దీంతో స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు ఈ పెంపు కూడా అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లో స్కూల్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెరిగినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు పెరగడంతో.. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు కార్లు ఒక్కో విద్యార్థిపై రూ.1000 నుంచి రూ.1200 వరకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలను పెంచినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇది తమకు అదనపు ఆర్థిక భారంగా మారుతోందని వాపోతున్నారు. గతేడాదితో పోలిస్తే రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగినట్లు పేర్కొంటున్నారు. అయితే ఇంధన ధరలు పెరగడం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాహనదారులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. చమురు ధరలు ఒక్కసారిగా పెరగాయని.. తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని చెబుతున్నారు. గతేడాది తమ ఇద్దరు పిల్లలకు కలిసి రూ.6 వేలు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు చెల్లించామని చెప్పిన ఓ మహిళ.. ఈ ఏడాది అది ఏకంగా రూ.7,500కి పెరిగినట్లు తెలిపారు. ఇక గత సంవత్సరం తమ ఒక్కగానొక్క పిల్లాడిని స్కూల్‌కు పంపించేందుకు ఆటోకు రూ.3,500 చెల్లించగా.. ఈ ఏడాది రూ.4,500కి పెంచారని మరో వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. చమురు ధరలు పెరగకముందు హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 107.39.. డీజిల్ రూ. 95.64గా ఉండేది. పెంచిన తర్వాత.. పెట్రోల్ రూ. 115.73, డీజిల్ రూ.103.82గా కొనసాగుతున్నాయి. దీంతో లీటర్ పెట్రోల్, డీజిల్‌పై దాదాపు రూ.8 పెరుగుదల కనిపించింది. నగర వ్యాప్తంగా తమ పిల్లలను మంచి స్కూల్‌లో చదివించాలని భావిస్తున్న తల్లిదండ్రులు.. తమ ఇంటికి దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపించేందుకు ఆటోలు, ప్రైవేటు కార్లను ఆశ్రయిస్తున్నారు. ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు తీసుకెళ్లి.. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు వాహనదారులు ట్రాన్స్‌పోర్టు ఫీజులు వసూలు చేస్తున్నారు. అయితే ఇలాంటి పరిస్థితి కేవలం హైదరాబాద్ నగరంలో మాత్రమే కాకుండా.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లోనూ ఇలాగే ట్రాన్స్‌పోర్టు ఫీజులు పెంచేశారని సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు, కామెంట్లు పెడుతున్నారు.

## మెట్రో ప్రాజెక్ట్...820 కోట్ల నష్టపరిహారం...

**హైదరాబాద్,** హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మొత్తం 888 ఆస్తులకు గాను 825 ఆస్తుల సేకరణ పూర్తయిందని, ఇది దాదాపు 93 శాతానికి సమానమని మెట్రో రైలు అధికారులు వెల్లడించారు. మిగిలిన ఆస్తులలో మూడు పురాతన కట్టడాలు వారసత్వ కట్టడాల పరిరక్షణ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. 10 కోర్టు కేసులతో పాటు, మరికొన్ని ఆస్తుల వివాదాలు భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అథారిటీ (ఎల్ఏఆర్ఆర్) పరిధిలో ఉన్నాయి. కొన్ని ఆస్తులు వక్ఫ్ బోర్డుకు చెందినవని తెలియక గతంలోనే కొనుగోలు చేశామని, ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో వివాదాలు మొదలయ్యాయని కొందరు పేర్కొంటున్నారు. బాధితులకు ఇప్పటికే సుమారు రూ. 820 కోట్ల పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో దారుల్‌షిఫా, పాత హవేలీ, హరిబౌలి, అలీజా కోట, శాలిబండ, పంషీర్‌గంజ్, ఫలక్‌నుమా మీదుగా ఈ ప్రాజెక్టు వెళ్తుంది. చారిత్రక కట్టడాలకు హాని కలగకుండా పనులు చేపడుతున్నామని, అలీయాబాద్ వంటి ప్రాంతాల్లో త్వరలో కూల్చివేతలు జరిపి రోడ్డు విస్తరణ చేస్తామని అధికారులు వివరించారు. దీని పర్యవేక్షణ కోసం జనరల్ కన్సల్టెన్సీకి టెండర్లు పిలిచారు.

## తిరుమల వ్యాపారుల సమస్యల పరిష్కారానికై తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి కి వినతి



**తిరుపతి** తిరుమలలోని పాపవినాశం, ఆకాశగంగ తదితర ప్రాంతాల్లో గత 50 సంవత్సరాలుగా షాపులు నిర్వహిస్తున్న వ్యాపారుల ప్రతినిధి బృందం ఈ రోజు తుడా కార్యాలయంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, సుమారు 30 మందికి పైగా వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దశాబ్దాలుగా ఆ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు సవివరంగా తెలియజేశారు. తమ సమస్యలను పరిశీలించి, వాటికి తగిన పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గౌరారంలో జనసేనకు బలం..

# బీజేపీ నేతల చేరిక



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) వర్గల్ మండలం గౌరారం గ్రామంలో జనసేన పార్టీకి బలం చేకూరింది. గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు తమ అనుచరులతో కలిసి బీజేపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకుడు కమ్మరి శ్రీను వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు.జనసేనలో చేరిన వారిలో బీజేపీ బూత్ అధ్యక్షుడు ఎల్కంటి మధుసూదన్ రెడ్డి, మాజీ బూత్ అధ్యక్షుడు పూదరి ప్రశాంత్ గౌడ్, బీజేపీ నాయకుడు పాశం నిఖిల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై నాయకులు, యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. వర్గల్ మండలంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో జనసేన పార్టీ విస్తరణకు యువత ముందుకు రావాలని, యువశక్తి మార్పుకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని కోరారు.జనసేనలో చేరిన నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న పార్టీ విధానాలు తమను ఆకర్షించాయని తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టించుకోని అధికారులు..

# నేలకొరిగిన సూచిక బోర్డులు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) రోడ్లపై ప్రయాణికులకు దారి చూపే సూచిక బోర్డుల నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల పేర్లు, రోడ్ల పరిస్థితి, సమీప గ్రామాల దూరాలను తెలియజేసే సూచిక బోర్డులు అస్తవ్యస్తంగా మారినా వాటి మరమ్మతులపై అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా పలుచోట్ల సూచిక బోర్డులు వంగిపోవడం, విరిగిపోవడం లేదా నేలకొరగడం జరుగుతున్నప్పటికీ వాటిని పునరుద్ధరించే చర్యలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోర్డులు పనికిరాకుండా పోతుండగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఏ గ్రామం ఎంత దూరంలో ఉందో, రోడ్డు పరిస్థితి ఎలా ఉందో తెలియక అయోమయానికి గురవుతున్నారు.మార్కూక్ మండలంలోని గణేష్‌పల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలుల కారణంగా నేలకూలిపోయింది. గ్రామం పేరుతో ఉన్న బోర్డు ప్రస్తుతం రోడ్డు పక్కన పడివుండటంతో ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న సూచిక బోర్డులను మరమ్మతులు చేసి, అవసరమైన చోట కొత్త బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# మేడ్చల్ గంగా గ్రాండ్యూర్ వెంచర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

### బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పట్టణములో ఉన్న గ్రాండ్యూర్ వెంచర్‌ను “ప్రొహిబిటెడ్” జాబితాలో చేర్చడంతో అక్కడి ప్లాట్, ఇంటి యజమానులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి సమస్యలను తెలుసుకోవడానికి భారతీయ జనతా పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డివెంచర్‌ను ప్రత్యక్షంగా సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం మేడ్చల్ తహసీల్దార్ ని కలిసి ఈ సమస్యపై చర్చించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు నేడు అనిశ్చితిలో పడటం బాధాకరమని పేర్కొన్నారు.ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి వెనుకాడదని హెచ్చరించారు.ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యంగా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ నాయకులు మేడ్చల్ డివిజన్ అధ్యక్షురాలు శైలజారినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్,ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, వంశీ విజయ్,ఉపాధ్యక్షులు మైసర్ రాజు,కార్యదర్శి విష్ణు మూర్తి గౌడ్, మాజీ సర్పంచ్ మురలీధర్ గుప్తా,సి చ్ శ్రీనివాస్ గౌడ్ సీనియర్ నాయకులు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బొజ్జ రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు బొజ్జ వంశీధర్ రెడ్డి,సి ఏచ్ శ్రీపాల్ రెడ్డి, మహేష్ గౌలికర్, ఎన్ శ్రీనివాస్ గౌడ్,నాగరాజు,ప్లాట్ యజమానులు శ్రీనివాస్, సంజయ్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు



# గృహ కార్మికుల నియామకంపై జాగ్రత్తలు పాటించాలి

### మేడ్చల్ సీఐ సత్యనారాయణ

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గృహ కార్మికులను నియమించుకునే విషయంలో నివాసితులు జాగ్రత్తలు పాటించాలని, గృహ కార్మికులందరి పోలీసు ధ్రువీకరణ (వెరిఫికేషన్) ప్రక్రియలను తప్పనిసరిగా అనుసరించటకు పోలీసులు సూచనలను జారీ చేశారని మేడ్చల్ సీఏ సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పోలీసుల దృష్టికి వచ్చిన సమాచారం ప్రకారం, కొందరు నేరస్తులు, ముఖ్యంగా గృహ కార్మికులు, సంరక్షకులు (కేర్‌టేకర్లు) ఇంటి పనివారిగా పనిచేస్తున్న నేపాలీ వ్యక్తులు, ఇంటి యజమానుల నమ్మకం సానుభూతిని సంపాదించి ఇళ్లలో ప్రవేశం పొందుతూ, అనంతరం దొంగలు ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.ఇటీవల ఇటువంటి మూడు కేసులు, అందులో ఒకటి లాభం కోసం చేసిన హత్య (మర్డర్ ఫర్ గెయిన్) కేసు సహా, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసెస్ నమోదు చేయబడ్డాయని తెలిపారు.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని, నివాసితులు గృహ కార్మికులను నియమించుకునే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంతవరకు నేపాలీ గృహ కార్మికులను నియమించకుండా ఉండాలని, అలాగే అన్ని గృహ కార్మికుల విషయంలో పోలీసు ధ్రువీకరణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

**సాధారణంగా అనుసరించే నేర పద్ధతులు:**

అనధికారిక లేదా ధ్రువీకరించలేని సిఫార్సుల ద్వారా ఉద్యోగం పొందడం, కుటుంబ సభ్యుల విశ్వాసాన్ని త్వరగా సంపాదించడం. ఇంట్లోని విలువైన వస్తువులు, కుటుంబ దినచర్యలు భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు.ఇంటి యజమానులు లేని సమయంలో దొంగతనకు పాల్పడి పారిపోతారని పేర్కొన్నారు.

**నివారణ చర్యలు:**

సాధ్యమైనంతవరకు నేపాలీ గృహ కార్మికులను నియమించకుండా ఉండాలని,. ఒకవేళ నియమించినట్లయితే, వారి నాగరికత/గుర్తింపు వివరాలను పూర్తిగా పొంది ఉండాలని చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రం, ఫోటోలు, మొబైల్ నంబర్ శాశ్వత చిరునామాను ధ్రువీకరించబడి ఉండాలని తెలిపారు. గృహ కార్మికుల వివరాలను రికార్డు నిర్వహణ కోసం మేడ్చల్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సాధ్యమైన చోట్ల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విలువైన వస్తువులు, లాకర్లు సున్నితమైన ప్రాంతాలకు వారి ప్రవేశాన్ని పరిమితం . చేయాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా సమాచారం తెలిసిన వెంటనే క్రింది నంబర్లకు సమాచారం అందించాలని మేడ్చల్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్



8712663280, 8712663281 8712663289 మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

# రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ సభ్యులు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన “రోడ్ అవేర్‌నెస్ -- అలై అరైవ్” కార్యక్రమంలో గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. గజ్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సీఐ రవికుమార్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ పిలుపు మేరకు గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి శిఖ గోయల్ పాల్గొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, ప్రమాదాల నివారణపై విలువైన సూచనలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ కరీం, ఉపాధ్యక్షులు పి. ఆంజనేయులు, కె. కుమార్ గౌడ్, యూసుఫ్ భాయ్, జి. ఆంజనేయులు, బి. భిన్న, ఎండీ బబ్లు, వెంకట్, బాబ్జాని, గౌస్, శ్రీగిరిపల్లి డ్రైవర్లు రాజు, జానీ, కృష్ణమూర్తి, దాసు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి డ్రైవర్ కీలక పాత్ర పోషించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లందరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాలి



ఎల్లారెడ్డిపేట ( ప్రశ్న న్యూస్) పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి అని మొక్కలు, చెట్లు ప్రజలకు స్వచ్ఛమయిన ఆక్సిజన్ ను అందిస్తాయని, తద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించే పరిస్థితులు ఏర్పడతాయని ఎల్లారెడ్డి పేట సీఐ ఓ .వెంకటేష్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలలో సీఐ వెంకటేష్ మొక్కలు నాటారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు పోలీసులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ పర్యవరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మన ఆరోగ్యం బాగుండాలన్నా, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా జీవించాలన్న ప్రతి వారు తమ ఇళ్లలో, రహదారుల ప్రక్కన, పంట చేల గట్లపై విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు రాహుల్ రెడ్డి ,సయ్యద్ అబ్దుల్ రజాక్, హెడ్ కానిస్టేబుళ్లు షబ్బీర్ అలీ, షబ్బీర్, కానిస్టేబుల్ పరుశురాములు, యాకూబ్ లు పాల్గొన్నారు.

# గ్రామ సభల్లో భరోసా కేంద్రం అవగాహన సదస్సు

### భరోసా సేవలు, పోక్సో చట్టం, సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు బుధవారం తంగళ్ళపల్లి మండలం కస్బెకట్కూరు, గండిలాచాపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో జిల్లా భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, మహిళలు మరియు బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, లింగ వివక్షత నివారణ, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక దోపిడీ, బాలలపై లైంగిక వేధింపుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.అదేవిధంగా సైబర్ స్టాకింగ్, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రతా చర్యలు, సైబర్ సెక్యూరిటీ వెబ్‌సైట్ల వినియోగం గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్‌లైన్-1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్-1930 సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం సిబ్బంది శిల్ప, మల్లీశ్వరి, స్వాభావతి, పవనిత తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీక

- అమ్మవారి దివ్యాశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి
- మల్లాపూర్ సర్పంచ్ : ఆకుల వనిత - నాగరాజు
- అంగరంగ వైభవంగా శ్రీ పోచమ్మతల్లి బోనాల పండుగ



బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ఆకుల వనిత--నాగరాజు ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మతల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి బోనాల నైవేద్యాలు సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల వనిత--నాగరాజు మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ పోచమ్మతల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షిస్తూ ఇలాంటి పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమీర్ పేట్ యు పిఎచ్‌సి ని సందర్శించిన డియంఎచ్‌ఓ డాక్టర్ పుట్ట శ్రీనివాస్



అమీర్ పేట్ (ప్రశ్నాన్యూస్) హైదరాబాద్ జిల్లా నూతన వైద్య ఆరోగ్యశాఖాధిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్. పుట్ట శ్రీనివాస అమీర్ పేట్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రోగులతో ముచ్చటించి సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. జిల్లా నూతన వైద్య ఆరోగ్యశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టి యూపిఎచ్‌సిని సందర్శించిన డాక్టర్. పుట్ట శ్రీనివాస్ కు ఎస్.పి.ఎచ్ ఓ. డాక్టర్ హేమలత సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్వప్న, ఆఫీస్ సబార్డినేట్ నాగేష్, యూపీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఎల్‌ఏల శిక్షణా కార్యక్రమానికి భీంగల్ నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

- పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో పని చేయాలి
- కాంగ్రెస్ పార్టీ భీంగల్ మండలాధ్యక్షులు : మల్లెల లక్ష్మణ్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, మోర్తాడ్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్‌ఏలు) శిక్షణా కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) అవగాహన కార్యక్రమానికి భీంగల్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలను మరింత విజయవంతం చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

## షూటింగ్ మొదలయ్యాక
# బడ్జెట్ 4-5 రెట్లు పెరిగింది
### - నాగబంధం నిర్మాత నిషిత



పెదకాపు ఫేం విరాట్ కర్ణ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం నాగబంధం (చీుస్త్రుుఝఅస్త్రుఎ). వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ అభిషేక్ నామా డైరెక్ట్ చేస్తున్నాడు. అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ మూవీ టీజర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న నాగబంధం చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో జులై 3న విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా నిర్మాత నిషితా నాగిరెడ్డి పలు ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది.తెలుగు వార్తలు సినిమా మొత్తం ఒకే పంథాలో సాగదు.. ప్రతీ పది నిమిషాలకోసారి ప్రేక్షకులు భిన్నమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్ ను పొందుతారు. చాలా సినిమాల్లో ఒకే సెటప్స్, సెట్స్ మళ్లీ మళ్లీ వినియోగిస్తుంటారు.. నాగబంధంలో ప్రతీ ప్రపంచం చాలా కొత్తదనంతో విభిన్నంగా ఉండాలనుకున్నాం. మేం ముందుగా అనుకున్న దాని కంటే 4-5 రెట్లు ఎక్కువగా బడ్జెట్ పెరిగింది. కానీ సినిమా అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. ఎందుకంటే మేం క్రియేట్ చేస్తున్న కంటెంట్, దాని ప్రత్యేకతలను ఎక్కువగా నమ్మామని చెప్పుకొచ్చింది నిషితా నాగిరెడ్డి. నాగబంధం చిత్రంలో ఇస్మార్ట్ భామ నభానటేశ్, ఐశ్వర్య మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్, తారక్ సినిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి, లక్ష్మి ఐరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు తెరకెక్కించి డెవిల్ తర్వాత అభిషేక్ నామా నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణల స్ఫూర్తిగా వస్తోన్న ఈ చిత్రంలో వచ్చే క్లైమాక్స్ ఇదివరకెన్నడూ చూడని విధంగా ఉండబోతుందట.

# రామ్ చరణ్ 'పెద్ది' వివాదంపై
# అదా శర్మ కామెంట్స్



'ది కేరళ స్టోరీ'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ త్వరలోనే 'గవర్నర్' అనే పవర్‌ఫుల్ చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో, చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ థ్రిల్లర్, 1990ల నాటి భారత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తెరకెక్కింది. ఆర్బీఐ గవర్నర్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి ఎలా రక్షించారనే యథార్థ సంఘటనల ఆధారంగా విపుల్ షా నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా అదా శర్మ.. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఆసక్తికరంగా స్పందించారు. 'పెద్ది' సినిమాలో మహిళలను అభ్యంతరకరంగా చూపించారనే విమర్శలతో దర్శకుడు బుచ్చిబాబు సనా ఇప్పటికే క్షమాపణలు చెప్పి ఆ సీన్లను తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై అదా మాట్లాడుతూ.. తాను ఆ సినిమాలో నటించలేదని, ఇంకా చూడలేదని చెబుతూనే, ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేని తన ప్రయాణం వేరని, కాబట్టి ఆ వివాదంపై మాట్లాడటం సరైంది కాదని చాకచక్యంగా తప్పించుకున్నారు. అయితే, నటీనటులు, దర్శకులు, రచయితలు ప్రాజెక్ట్‌లను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మన చిన్న తప్పుడు నిర్ణయం సమాజంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మహిళలకు భిన్నమైన కోణాలు ఉన్న స్క్రిప్టులనే తాను ఇష్టపడతానని ఆమె స్పష్టం చేశారు.

# యాక్షన్‌తో అదరగొట్టిన అలియా భట్..
### - 'ఆల్ఫా' టీజర్ రిలీజ్




యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌ఫైట్లు, ఫైటింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది. మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# లాంగ్ బ్రేక్ తర్వాత కమ్‌బ్యాక్‌కు సిద్ధమైన కత్రినా కైఫ్..
### - ఓటీటీపై కూడా ఫోకస్!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పెళ్లి, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కుటుంబ బాధ్యతల్లో బిజీగా ఉన్న కత్రినా గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే ఇప్పుడు ఆమె మళ్లీ కెమెరా ముందుకు రావడానికి ఆసక్తి చూపుతున్నట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల పలువురు దర్శకులు, నిర్మాతలు వినిపిస్తున్న కథలను కత్రినా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఆమె కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుండా, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారట. బలమైన కథాంశాలు, కొత్త తరహా పాత్రల కోసం ఆమె ఎదురుచూస్తున్నట్లు సమాచారం. డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కత్రినా కూడా ఓటీటీ ప్రాజెక్టులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ఒరిజినల్స్, మహిళా ప్రధాన కథలపై ఆమె ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారని బీ-టౌన్‌లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పలు ప్రముఖ ఓటీటీ సంస్థలు కత్రినాతో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. కత్రినా చేయబోయే కొత్త సినిమాలు, డిజిటల్ ప్రాజెక్టులపై ఈ ఏడాది చివర్లో స్పష్టత వచ్చే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కథలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అన్ని అనుకున్నట్లే జరిగితే వచ్చే ఏడాది నుంచి కత్రినా మళ్లీ షూటింగ్‌లతో బిజీ కానున్నారు. అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆమె కమ్‌బ్యాక్ కోసం ఇప్పటికే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కత్రినా చివరిసారిగా మేరీ క్రిస్‌మస్ చిత్రంలో నటించారు. ఈ సినిమాలో ఆమెకు జోడీగా విజయ్ సేతుపతి కనిపించారు.

విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తర్వాత ఆమె కొత్త ప్రాజెక్టులను ప్రకటించలేదు. ప్రస్తుతం భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న కత్రినా, త్వరలోనే కొత్త కథలు, కొత్త పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కత్రినా కైఫ్ గ్రాండ్ కమ్‌బ్యాక్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఆమె తదుపరి ప్రాజెక్ట్ ఏంటనే విషయంపై ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చలు జోరుగా సాగుతున్నాయి.

# నియంతపై సమరభేరి



క్రూరుడైన ఓ నిరంకుశ పాలకుడి నుంచి స్వజనులను, మాతృభూమిని విముక్తి చేయడానికి ఓ సాహసి తిరుగుబాటు జెండా ఎగరేస్తాడు. ఆధిపత్యాన్ని ఎదిరిస్తూ అత్యంత ప్రమాదకరమైన ప్రయాణాన్ని మొదలుపెడతాడు. ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లేమిటి? తన వారి స్వేచ్ఛకోసం అతను చేసిన పోరాటం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే 'సంబరాల ఏటిగట్టు' సినిమా చూడాల్సిందే అంటున్నారు మూవీ మేకర్స్. సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రానికి రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్నారు. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఇటీవలే ముంబైలో కీలక షెడ్యూల్ పూర్తయింది. ఇందులో ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు పాల్గొన్నాడని, 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత తమ సంస్థ నుంచి వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని, సాయిధరమ్‌తేజ్ పాత్ర అత్యంత

# కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తాం




సినీరంగంలో నూతన ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో టీఎఫ్‌సీసీ షార్ట్‌ఫిల్మ్ అవార్డ్స్ 2026ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్‌కు భారీగా ఎంట్రీలు వస్తున్నాయని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కె.గౌడ్ తెలిపారు. ఈ అవార్డుల కమిటీకి సీనియర్ నటి ఇంద్రజను జ్యూరీ ఛైర్మన్‌గా ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. దాదాపు 30 కేటగిరీల్లో మొదటి ఐదుగురు విజేతలకు అవార్డ్స్ అందిస్తామని, మొదటి ముగ్గురు విజేతలకు అవార్డ్స్ పాటు నగదు బహుమతిని కూడా అందిస్తామని తెలిపారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహిస్తామని ఆర్.కె.గౌడ్ పేర్కొన్నారు. ఔత్సాహికులైన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 13వరకు ఎంట్రీలకు సమయం ఉందని ఇంద్రజ తెలిపారు.

# సిద్ధుగాడి ప్రేమకథ



మనోజ్‌కుమార్, మోహన సిద్ధి, శృతి శంకర్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ'. రమేశ్ చెరుకూరు దర్శకుడు. సావిత్రమ్మ నిర్మాత.

ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, వీఎన్ ఆదిత్య, వి.సముద్ర, రామ్‌ప్రసాద్, నిర్మాతలు వి.దామోదరప్రసాద్, అశోక్‌కుమార్, టి.ప్రసన్నకుమార్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. సందేశంతో కూడిన ఈ ప్రేమకథ ప్రేక్షకులను తప్పక ఆకట్టుకుంటుందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు రమేశ్ చెరుకూరు చెప్పారు. సొంతూరిని వదిలి, దూరప్రాంతాలకు వెళ్లిన వారి జీవితాలకు ఈ కథ మరింత దగ్గరగా ఉంటుందని హీరో మోహనసిద్ధి అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాట లు: మొండెం శ్రీధర్, కెమెరా: దోసడ యాదగిరి

### జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి

# అందరూ సహకరించాలి

**- జూనియర్ సివిల్ జడ్జి మాధవి**



మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్) ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు, మీడియేషన్ కో–ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి పిలుపునిచ్చారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ–లోక్ అదాలత్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కక్షిదారులు పరస్పరం రాజీకి వచ్చేలా న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు. మీడియేషన్ కో–ఆర్డినేటర్లు కౌన్సెలింగ్ ద్వారా వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.అలాగే శ్రీరామ్ చిట్స్, కెనరా బ్యాంకు ప్రతినిధులు తమ ఖాతాదారులపై ఉన్న కేసులను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన,తక్కువ ఖర్చుతో వివాదాల పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, సీఐ సురేష్, ఎస్సైలు కిరణ్‌కుమార్, నవీన్, అశోక్, మీడియేషన్ కో–ఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, తునికి వేణుగోపాల్, బక్కూరి రమేష్, పసునూరి శ్రీనివాస్‌తో పాటు న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, పోలకొండ దయాకర్ వర్మ, జేడి సుధాకర్, తెడ్డు ఆనంద్, మగ్గిడి నర్సయ్య, గురిజెల గోపి, రాజశేఖర్, కోల అశోక్, తుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**- మర్లపేట సర్పంచ్ : భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి**

**- అరటి ఆకుల్లో అల్పాహారం**

**- పర్యావరణ పరిరక్షణకు సర్పంచ్ వినూత్న సందేశం**

**- మర్లపేటలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గ్రామ సభ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మర్లపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక", 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామసభను సర్పంచ్ భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో గ్రామసభకు హాజరైన మండల అధికార బృందానికి,ప్రజలకు అరటి ఆకుల్లో అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి,నీరు, జీవరాశులకు తీవ్ర నష్టం కలుగుతోంది. అందుకే గ్రామస్థులు ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలి. మన గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు.చిన్నచిన్న మార్పులతోనే పెద్ద ఫలితాలు సాధించవచ్చు" అని అన్నారు.అలాగే ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం కావడానికి గ్రామస్థులు సహకరించాలని, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శరత్, ఎంపీడీఓ భీమా జయశీల,ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు వీడ్కోలు - ఘన సన్మానం

**- సమర్థ సేవలందించిన ఉద్యోగులను గౌరవించడం ఆనందంగా ఉంది**

**- వేములవాడ ప్యాక్స్ చైర్మన్ : ఏనుగు తిరుపతి రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీ) ఉద్యోగులు బదిలీపై వెళ్తుండగా వారికి వేములవాడ ప్యాక్స్ పాలకవర్గం ఘనంగా వీడ్కోలు పలికింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మెన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఉద్యోగులు అరుణ్ కుమార్, ఝాన్సీ, శ్రీకాంత్‌లను శాలువాలతో సత్కరించి, శ్రీ రాజరాజేశ్వరస్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని, విధులు నిర్వహించిన ప్రాంతంలో బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల ఆదరణ పొందిన ఉద్యోగులను గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన బ్యాంకు సిబ్బందికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు రాజయ్య, సంజీవరెడ్డి, కొండ శేఖర్, అమృత, సీఈఓ లక్ష్మణ్, మాజీ డైరెక్టర్లు గుడిసె సదానందం, రాచర్ల మహేందర్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విజయ్ పవన్, ఉద్యోగులు సతీష్, శ్వేత, లావణ్య, అంజలి, విమల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సహచరులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.

# నీలోజిపల్లి దేవాలయ వివాదంలో హైకోర్టు కీలక తీర్పు

**- తహశీల్దార్ జారీ చేసిన ధృవీకరణ పత్రం రద్దు**

**- ప్రజా దేవాలయాన్ని వ్యక్తిగత ఆస్తిగా ఎలా గుర్తిస్తారని హైకోర్టు ఆగ్రహం**

**- గ్రామ హక్కుల పరిరక్షణకు హైకోర్టులో విజయం హర్షణీయం**

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయానికి సంబంధించిన వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గ్రామ ప్రజల విరాళాలు, పాత దేవాలయ నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో నిర్మితమైన ఈ దేవాలయాన్ని ఒక వ్యక్తి వ్యక్తిగత ఆస్తిగా పేర్కొంటూ బోయినిపల్లి తహసీల్దార్ జారీ చేసిన ధృవీకరణ పత్రాన్ని హైకోర్టు రద్దు చేసింది. వివరాల్లోకి వెళితే, తహసీల్దార్ కార్యాలయం నుంచి 2026 మార్చి 31న జారీ చేసిన సర్టిఫికెట్ నెంబర్. బి/234/2026 ద్వారా దేవాలయాన్ని ఒక వ్యక్తికి చెందిన ఆస్తిగా ధృవీకరించడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ పంచాయతీ తరఫున గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.బుధవారం జరిగిన విచారణ సందర్భంగా ప్రజా నిధులు, గ్రామ ప్రజల సహకారంతో



నిర్మించబడిన దేవాలయాన్ని వ్యక్తిగత ఆస్తిగా ఎలా గుర్తించారంటూ హైకోర్టు తహసీల్దార్ చర్యలపై ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. అనంతరం సంబంధిత ధృవీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ తీర్పుతో గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. గ్రామానికి చెందిన ప్రజా ఆస్తులు, హక్కుల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా పోరాడిన సర్పంచ్ అనుముల భాస్కర్‌ను గ్రామస్తులు అభినందించారు.గ్రామ ప్రజల ఆస్తుల సంరక్షణ, ప్రజా హక్కుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం గ్రామ ప్రజలకు చెందిన ప్రజా దేవాలయమేనని మరోసారి స్పష్టమైందని సర్పంచ్ భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

# మతిభ్రమించి మాట్లాడుతున్న పుట్ట మధు ఖబర్దార్.

**చదువురాని దద్దమ్మ పుట్ట మధు.**

**మధు వాక్యాలను ఖండించిన మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**అనుచిత వ్యాఖ్యలు చేసిన పుట్ట మధు.**

**నోరు అదుపులో పెట్టుకోకుంటే నిన్ను మహిళలతోని చెప్పులతో కొట్టిస్తాం.**

**నోరు ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోం. బిడ్డ.**

**పుట్ట మధు నువ్వు చదువు రాని దద్దమ్మవు.**

**శ్రీధర్ బాబు చదువుకున్న గొప్ప వ్యక్తి.**



మంథని ( ప్రశ్న న్యూస్) పుట్ట మధు నిన్న జైలు బరో పేరుతో కమిషనర్ ఆఫీస్ ముందు వీరంగం సృష్టించి మంత్రి శ్రీధర్ బాబును, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శీను బాబు పైన చేసినటువంటి విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, సూరయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు, మాజీ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్, గార్లు మాట్లాడుతూ. పౌరుల తమ వ్యక్తిగత విషయాలను యూట్యూబ్లో బహిర్గతం చేసినటువంటి పూదరి సత్యనారాయణ గౌడ్ ను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్కు తీసుకెళ్తే విచారణ చేయొద్దు మా కార్యకర్తలను ఏమనద్దు అని చెప్పి మాట్లాడడం జరిగింది. చట్టం తన పని తను చేసుకో పోతుంది దానికి మా శ్రీధర్ బాబు, శీను బాబు గార్లకి ఏం సంబంధం ఉంటుందని నాయకులు ప్రశ్నించారు. అరేయ్ కేటీఆర్ ఇదేనా నువ్వు మీ నాయకులుకు నేర్పిన సంస్కారం అని కేటీఆర్ ను ప్రశ్నించారు. నీ గత 10 ఏళ్లలో నువ్వు ఇక్కడ ఎన్నో అరాచకాలు, హత్యలు చేసినటువంటి నువ్వు ఇవాళ రాజ్యాంగాన్ని పట్టుకొని నీతులు చెప్పడం సిగ్గుచేటని ఈ సందర్భంగా తెలిపారు.మా నాయకులు శ్రీధర్



బాబు రాజ్యాంగబద్ధంగా మంత్రి పదవిలో ఉండి తెలంగాణ రాష్ట్రాన్ని, మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తూ ఇక్కడున్నటువంటి బడుగు బలహీన వర్గాలను సంక్షేమ పథకాలును అందిస్తున్నారని వారన్నారు. శ్రీను బాబు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఉంటే నీ కండ్లు ఓర్వలేకనే ఈ యొక్క కుట్ర అని తెలిపారు.నీకు రాబోయే రోజుల్లో పుట్టగతులు ఉండవని శ్రీధర్ బాబు పైన శీను బాబు గారి పైన విమర్శలు చేస్తా ఉన్నావ్ నీ నీచ రాజకీయ ఉనికి కోసమే చిల్లర మాటలు మాట్లాడుతున్నావు.ఏమైనా మాట్లాడితే బహుజనవాదం అంటా ఉన్నావ్, ప్రజలను రక్షిస్తూ లాండ్ ఆర్డర్ కాపాడుతున్నటువంటి పోలీసులను సైతం దుర్భాషలాడుతా ఉన్నవ్, ఒకపక్క బహుజనవాదం అంటావు నువ్వు, ఆ అధికారులు కూడా బహుజనులే కదా వారిని దూషించడం ఎంతవరకు సమన్వయం అని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. ఏదైతే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చెప్పి మీ నాయకుడు కేసీఆర్ అన్నారు అదే రాజ్యాంగాన్ని చూపిస్తూ అంతకునివి సంఘ విద్రోహి అయినా నువ్వు మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అధికారులను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తావున్నావ్ మీరు అధికారంలోకి వచ్చేది లేదు మీ తాటాకు సప్పులకు ఎవరు భయపడరని ఈ సందర్భంగా తెలిపారు ఏదో మాస్ లీడర్ మాస్ లీడర్ అని మాట్లాడుతున్నావ్, మా దగ్గర కూడా మాస్ లీడర్లు ఎంతోమంది ఉన్నారు మాకు శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేస్తున్నారు కాబట్టే, మేము ప్రశాంతంగా ఓపికగా ఉంటున్నాం అంతేగాని ఒక్క కనుసైగా చేస్తే నీ రూపురేఖలు లేకుండా చేస్తామని, ఇది గుర్తుంచుకోవాలని పుట్ట మధును హెచ్చరించారు మా నాయకులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శ్రీను బాబు గార్లని నీ నోటికి ఎంత వస్తే అంత మతిభ్రమించి మాట్లాడుతున్నావు, నువ్వు ఇంకొకసారి మా నాయకుడిని నీ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడితే ఊరుకోబోమని తస్మాత్ జాగ్రత్త పుట్ట మధు అని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్రమోదీ సేవలు దేశానికి దిక్సూచి

**- బీజేపీ మండలాధ్యక్షులు : పంజాల ప్రశాంత్**

**- మోదీ సుదీర్ఘ పదవీకాలం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు**



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా,గంగాధర మండల కేంద్రంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోడీ సుదీర్ఘ ప్రధానమంత్రి పదవీకాలాన్ని పురస్కరించుకొని బుధవారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగాధర మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పంజాల ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రధానమంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా నరేంద్ర మోడీ కొత్త రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం ఆయన మరింత కాలం ఆరోగ్యంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా ఓబీసీ మోర్చా జిల్లాధ్యక్షులు దూలం కళ్యాణ్, కిసాన్ మోర్చా జిల్లాధ్యక్షులు తుమ్ నారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు సదాల భాస్కర్,సర్పంచ్ కోల శ్రీనివాస్, మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండారపు మధు, మండల ప్రధానకార్యదర్శులు శ్రీనివాస్, తాళ్ల రాజశేఖర్, జిల్లా సోషల్ మీడియా కో – కన్వీనర్ ఆకుల మనోహర్,కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచాల రాములు, చిందం ఆంజనేయులు, వేముల గంగన్న, అనిల్ తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోదీ పాలన 12 ఏళ్లు పూర్తి.. బోయినిపల్లిలో ప్రత్యేక పూజలు

**- దేశ ప్రగతి కోసం మోదీ నాయకత్వం కొనసాగాలి**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల విజయవంతమైన పాలన పూర్తైన సందర్భంగా భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ అధ్యక్షతన బోయినిపల్లి మండల కేంద్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ భద్రత, భారతదేశ ప్రతిష్ఠలను ప్రపంచవ్యాప్తంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో దేశానికి మరింత సేవ చేయాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నర్సింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్,గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, పసికంటి వెంకటేశం, సీనియర్ నాయకులు రమేష్, ప్రసాద్‌తో పాటు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టి తవ్వకాలపై పర్యవేక్షణ కరువు..! పెరుగుతున్న అక్రమాలు..!!

**- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం - అధికారుల మౌనం?**

**- మట్టి రవాణాను ఆపకపోతే ఆందోళనలు తప్పవు**


**- సీపీఎం మండల కన్వీనర్ : గురిజాల శ్రీధర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఆవేదన వ్యక్తంచేశారు. అనుమతుల కంటే ఎక్కువ లారీలతో మట్టిని తరలిస్తున్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని విమర్శించారు. చిన్న రైతులకు నిబంధనలు చూపుతూ అడ్డంకులు సృష్టించే అధికారులు, కాంట్రాక్టర్ల అక్రమాలకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. చెరువు మట్టిని స్థానిక రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, అక్రమ తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# విద్యాహక్కు ఉత్తుత్తిదేనా.?

- మేడ్చల్ మండలంలో కాగితాలకే పరిమితమైన ఆర్టీఈ చట్టం
- కోటా ఉన్నా దక్కని సీట్లు.. పేద విద్యార్థుల కలలపై ప్రైవేటు పాఠశాలల నిర్లక్ష్యం
- ఆర్టీఈ అమలుకు అడ్డుగోడలు
- కార్పొరేట్ స్కూళ్లలో 25% ఉచిత సీట్ల నిబంధన బేఖాతరు!
- విద్యా హక్కు.. పేదలకు మిథ్య
- మేడ్చల్‌లో అటకెక్కిన ఉచిత అడ్మిషన్ల ప్రక్రియ
- చట్టాలు ప్రభుత్వానివి.. ఇష్టారాజ్యం ప్రైవేటు పాఠశాలలది
- పర్యవేక్షణ కరువవడంతో నిర్వీర్యమవుతున్న సామాజిక న్యాయం




**పేద, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం మేడ్చల్ మండలంలో కాగితాలకే పరిమితమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచిత ప్రవేశాలకు కేటాయించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ, అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న వేళ వేలాది పేద కుటుంబాలు తమ పిల్లలకు చట్టబద్ధంగా దక్కాల్సిన అవకాశాల కోసం ఎదురుచూస్తుండగా, విద్యాహక్కు అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )**పాఠశాలలు తెరుచుకునే వేళ పేద కుటుంబాల్లో మరోసారి అదే ప్రశ్న వినిపిస్తోంది. ప్రభుత్వం కల్పించిన విద్యాహక్కు నిజంగానే తమ పిల్లలకు వర్తిస్తుందా.? లేక చట్ట పుస్తకాలకే పరిమితమైందా.? విద్యను ప్రతి చిన్నారి హక్కుగా గుర్తిస్తూ రూపొందించిన విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అమలులో మేడ్చల్ మండలంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న ఆనవాళ్లు కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రభుత్వ లక్ష్యం.. క్షేత్రస్థాయిలో వైఫల్యం

2009లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత, నిర్బంధ విద్య అందించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ చట్టం లక్ష్యం కేవలం పాఠశాలకు పంపడమే కాదు, ఆర్థిక పరిస్థితుల కారణంగా నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పిల్లలకు అవకాశాలు కల్పించడం కూడా. ఇందులో భాగంగా ప్రైవేటు పాఠశాలలు తమ ప్రవేశాల్లో 25 శాతం సీట్లను బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచిత విద్య అందించాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, అమలు మాత్రం ఆశించిన స్థాయిలో లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### అర్హులైనా దక్కని ప్రవేశాలు


చట్టం ప్రకారం అనాథలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, హెచ్ఐవీ ప్రభావిత కుటుంబాల పిల్లలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనార్టీలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ కోటా కింద ప్రవేశాలకు అర్హులు. అయితే మండలంలో అనేక ప్రైవేటు విద్యాసంస్థలు ఈ నిబంధనలను పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రవేశాల సమయంలో ఆర్టీఈ కోటాపై సమాచారం ఇవ్వకపోవడం, దరఖాస్తులను స్వీకరించడంలో ఆసక్తి చూపకపోవడం, వివిధ కారణాలు చూపుతూ అడ్మిషన్లను నిరాకరించడం వంటి ఫిర్యాదులు ప్రతి ఏడాది వినిపిస్తున్నాయి.

### నిర్వీర్యమవుతున్న సామాజిక న్యాయం

మేడ్చల్ మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. లక్షకు పైగా విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారు. చట్టం ప్రకారం చూస్తే వేలాది మంది పేద విద్యార్థులు ఉచిత విద్యకు అర్హులవుతారు. కానీ వాస్తవంగా ఆ అవకాశాన్ని పొందుతున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సామాజిక న్యాయం కోసం రూపొందించిన చట్టం క్రమంగా నిర్వీర్యమవుతోందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

### కోర్టుల ఆదేశాలూ బేఖాతరు

ఈ అంశంపై గతంలో పలు సందర్భాల్లో న్యాయస్థానాలు కూడా విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలహీనంగా ఉండటం, ఉల్లంఘనలపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని విద్యా హక్కు




ఉద్యమకారులు పేర్కొంటున్నారు.

### వేచి చూడటమేనా..

ఇప్పటికే కొత్త విద్యాసంవత్సరం ప్రారంభానికి రంగం సిద్ధమైంది. బడి గంటలు మోగబోతున్న వేళ, తమ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందన్న ఆశతో అనేక పేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ఉద్దేశించిన ప్రయోజనాలు నిజంగా అర్హులకు చేరాలంటే ప్రవేశాల దశ నుంచే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. చట్టం అమలు అవుతుందా ? లేక మరో విద్యాసంవత్సరం కూడా కాగితాలకే పరిమితమవుతుందా.. అన్నది ఇప్పుడు వేలాది కుటుంబాల ఎదురు చూపుగా మారింది.

ప్రజాప్రశ్న EFFECT

# అధికారుల స్పందన

## బండ్లగూడలో డ్రైనేజీ సమస్యకు మోక్షం

- 'ప్రజాప్రశ్న' కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు
- రంగంలోకి దిగి పనులు పూర్తి చేయించిన శానిటేషన్ సూపర్‌వైజర్ అజర్





**కీసర (ప్రజాప్రశ్న )** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఠాకూర్ కాలనీలో గత కొంతకాలంగా స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజీ లీకేజీ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. కాలనీలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ, నరకప్రాయంగా మారిన పరిస్థితులపై ఇటీవల పత్రికలో (ప్రజాప్రశ్న) ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించారు.కథనం పట్ల సానుకూలంగా స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, దమ్మాయిగూడ మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ అజహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బుధవారం ఆయన స్వయంగా సిబ్బందితో కలిసి ఠాకూర్ కాలనీని సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు. అనంతరం అత్యాధునిక శానిటైజేషన్/వ్యాక్యూమ్ క్లీనింగ్ వాహనాన్ని (సక్షన్ ట్యాంకర్) రంగంలోకి దించి, డ్రైనేజీ లైన్లలో పేరుకుపోయిన పూడికను, వ్యర్థాలను పూర్తిగా తొలగింపజేశారు.


ప్రజాప్రశ్న
పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. డ్రైనేజీలపై లేదా.?
ఠాకూర్ కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నరకప్రాయంగా మారిన స్థానికుల జీవితాలు

### స్థానికుల హర్షం -- అధికారులకు కృతజ్ఞతలు:

చాలా రోజులుగా దుర్వాసనతో, దోమల బెడదతో నరకం చూస్తున్న తమ సమస్యను పత్రికా ముఖంగా వెలుగులోకి తెచ్చినందుకు, దానికి వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించిన శానిటేషన్ సూపర్‌వైజర్ అజహర్, మున్సిపల్ సిబ్బందికి ఠాకూర్ కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇకనైనా ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# భారతీయులున్న నౌకపై యూఎస్ దాడి

**- భారత్ తీవ్ర నిరసన.. అమెరికన్ దౌత్యవేత్తకు సమన్లు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, 24 మంది భారత సిబ్బంది ఉన్న వాణిజ్య నౌకపై అమెరికా బలగాలు జరిపిన దాడిని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ సీనియర్ దౌత్యవేత్తకు బుధవారం సమన్లు జారీ చేసింది. ఒమన్ గల్ఫ్‌లో జరిగిన ఈ ఘటనలో 21 మంది సిబ్బంది క్షేమంగా బయటపడగా, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించింది. పలావు జెండాతో ఉన్న 'ఎంటీ మారివెక్స్' అనే ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ దాడికి పాల్పడింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఆ నౌక ప్రయాణించిందని, తమ ఆదేశాలను పాటించకపోవడంతో ఇంజిన్ రూమ్‌ను ధ్వంసం చేసేందుకు దాడి చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌక నుంచి బయలుదేరిన ఎఫ్–18 ఫైటర్ జెట్ ఈ దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది.దాడి జరిగిన తరుణంలో నౌకలోని భారత సిబ్బంది పంపిన అత్యవసర సందేశాలు ఆందోళన తీవ్ర ఆందోళన కలిగించాయి. "మా నౌకపై అమెరికా నేవీ క్షిపణి దాడి చేసింది. దీనివల్ల ఇంజిన్ రూమ్ దెబ్బతినడమే కాకుండా, నౌక కింద భాగంలో రంధ్రం పడింది. మేమంతా 24 మంది భారతీయ సిబ్బంది ఉన్నాం, దయచేసి త్వరగా మమ్మల్ని రక్షించండి" అంటూ వారు వేడుకున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే స్పందించిన ఒమన్ నావికాదళ, హెలికాప్టర్ల ద్వారా సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. గల్లంతైన ముగ్గురు సిబ్బంది కోసం ఒమన్ అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. సమస్యాత్మక జలాల్లో ప్రయాణించే భారతీయ పౌరులు, వాణిజ్య నౌకల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని భారత్ స్పష్టం చేసింది. ఇరాన్‌తో నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా ఆంక్షలను కఠినంగా అమలు చేస్తుండటంతో, ఈ ప్రాంతంలో తరచూ ఇటువంటి ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

# దేశాన్ని కాంగ్రెస్ అగాధంలోకి నెట్టింది

**- ఎన్‌డీయే సమావేశంలో కీలక ప్రసంగం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎన్‌డీయే కూటమి సమావేశంలో కీలక ప్రసంగం చేశారు. ఈ ఘనత తన వ్యక్తిగత విజయమేమీ కాదని, ఎన్‌డీయే కుటుంబం సాధించిన ఉమ్మడి విజయమని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, 2014 తర్వాత దేశంలో చోటుచేసుకున్న మార్పులను ప్రస్తావించారు. ఆయన చేసిన ప్రసంగంలోని వివరాల్లోకి వెళ్తే.. నెహ్రూ రికార్డును అధిగమించడం తన జీవితంలో ప్రత్యేక ఘట్టమని మోదీ అన్నారు. ఇంతకాలం ఎన్నికైన ప్రధానిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ విజయాన్ని తన వ్యక్తిగత విజయంగా చూడడం లేదన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు, కార్యకర్తలు, కోట్లాది ప్రజల సహకారంతోనే ఈ ప్రయాణం సాధ్యమైందని పేర్కొన్నారు. దేశ ప్రజల రాజకీయ పరిణతి వల్లే స్థిర ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. 2014కు ముందు దేశం అస్థిరత, అనిశ్చితి కారణంగా నష్టపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ దేశాన్ని అవినీతి, విధానపరమైన వైఫల్యాలు, నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు. అభివృద్ధి నెమ్మదిగా సాగడాన్ని 'హిందూ గ్రోత్ రేట్'గా పిలవడం తప్పని, దాన్ని 'కాంగ్రెస్ గ్రోత్ రేట్'గా పిలవాలని అన్నారు. గత 12 ఏళ్లలో 25 కోట్ల మందికిపైగా పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. ఇది ప్రభుత్వ విధానాలు సరైన దిశలో ఉన్నాయనే విషయాన్ని నిరూపిస్తోందన్నారు. వికసిత భారత్ లక్ష్యం ఇప్పుడు కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదన్నారు. దేశ ప్రజలందరి కలగా, సంకల్పంగా అది మారిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భారీ పురోగతి సాధించినట్లు వివరించారు. 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ఆ సంఖ్య ఇప్పుడు 160కి చేరిందని చెప్పారు. ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో సేవలు, రక్షణ ఎగుమతులు, డిజిటల్ లావాదేవీల్లో దేశం గణనీయ పురోగతి సాధించిందని మోదీ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ తయారీ, సౌర విద్యుత్ ఉత్పత్తి, సెమీకండక్టర్ రంగాల్లో భారత్ ప్రపంచ స్థాయిలో ముందుకు వెళ్తోందని తెలిపారు. యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి ప్రజల ఆశయాలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పరుగులో ఎవరూ వెనుకబడొద్దనే ఉద్దేశంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.

# సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ

**- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని ధీమా**





**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి లభించిన సరైన నాయకుడు నరేంద్ర మోదీ" అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయనకు కృతజ్ఞతా తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ 'నేషన్ ఫస్ట్' అనే నినాదంతో పనిచేస్తారని చంద్రబాబు కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, మోదీ తన సమర్థవంతమైన పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూర్చారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని తెలిపారు. మోదీ ఎన్నడూ అలసిపోరని, నిత్యం ఉత్సాహంగా ఉంటూ అందరిలోనూ స్ఫూర్తిని నింపుతారని ప్రశంసించారు. సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసమే ఏర్పడతాయని, కానీ ఎన్డీయే మాత్రం దేశం కోసం ఆవిర్భవించిన కూటమి అని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసం కాకుండా దేశ ప్రయోజనాల పరమావధిగా ఎన్డీయే ప్రయాణం సాగుతోందని, వివిధ రాష్ట్రాల్లో ఈ కూటమి సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న గొప్ప నేత మోదీ అని, ఆయన నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

# రోడ్లు మింగేస్తున్న నిర్మాణాలు.. టౌన్ ప్లానింగ్ మౌనం




- నిబంధనలకు సమాధి.. అక్రమాలకు పచ్చజెండా
- రోడ్ల వెడల్పును కుదిస్తూ సాగుతున్న అక్రమ నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనంపై ప్రజల్లో ఆగ్రహం





**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 6వ వార్డులో సెట్‌బ్యాక్‌లు, రహదారుల వెడల్పు నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.నిబంధనల ప్రకారం 18 నుంచి 20 అడుగుల వెడల్పు ఉండాల్సిన రహదారులు ఆక్రమణల కారణంగా కుచించుకుపోతున్నాయని, దీంతో భవిష్యత్తులో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి మౌనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మున్సిపల్ కమిషనర్ తరచూ నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది."చట్టం సామాన్యులకేనా..? అక్రమార్కులకు మినహాయింపా..?" అంటూ స్థానిక ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, రహదారుల ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588